ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

అక్టోబర్ 04, 2015

తెలుగులో తొలి నేపథ్య గాయని

వెరీ గుడ్డూ...

అర్జున్ కపూర్

సోనాక్షి సిన్హా

సల్మాన్ ది గురూ...

సల్మాన్ ఖాన్ అంటే వరస వివాదాలు, క్యూ కట్టిన రికార్డులు, బారులు తీరే అభిమానులు. ఇవి కాక .. సల్మాన్ మరో కోణం.. బాలీవుడ్‌కు స్టార్లను రూపుదిద్దే గురూ. కొందరిని లాంచ్ చేస్తే, కొందరి కెరీర్‌లో ప్రతి మలుపులో వెంటుండి గాడిన పెట్టాడు. కొందరికి ఫిట్‌నెస్ ట్రెయినర్‌గా మారితే, కొందరికి పర్సనాలిటీ డెవలెప్‌మెంట్ గురూగా వారికి స్ఫూర్తిగా నిలిచాడు. ఈ మెగా మెంటర్ శిక్షణతో, తోడుతో, అండతో పైకొచ్చిన స్టార్లంతా ఎన్ని విభేదాలున్నా సల్లూ భాయ్‌కు బహిరంగంగానే తమ కృతజ్ఞతలు చెప్పుకుంటారు. చాలా మంది దక్షిణాది స్టార్లు సైతం బాలీవుడ్‌లోనో, ముంబై సినీ ప్రపంచంలోనో పనిపడితే ముందుగా తలుపు కొట్టేది సల్మాన్‌జీ ఇంటిదే. కొన్ని రోజుల క్రితమే సూరజ్ పంచోలి, అతియా శెట్టినీ వెండితెర వెలుగుల్లో తడబడకుండా నిలబెట్టాడు.

హృతిక్ రో'షైన్'

హృతిక్ అంటే ఇప్పుడో ఇండియన్ సూపర్ హీరో. ఒకప్పుడు చాలా పీలగా, సిగ్గరిగా ఉండే హృతిక్‌లో పెద్ద మార్పు తెచ్చింది సల్మానే. కరణ్ అర్జున్ సినిమా షూటింగ్ సమయాన తండ్రి రాకేశ్ రోషన్ ద్వారా సల్లూను కలిసిన హృతిక్‌లో ఆత్మవిశ్వాసాన్ని తారాస్థాయికి చేర్చాడు. కేవలం మాటలే కాక జిమ్‌కు వెంటబెట్టుకెళ్లి స్టన్నింగ్ లుక్‌ను పొందేలా చేశాడు. తానే స్వయంగా హృతిక్ ఫోటోలు అందరికీ చూపెడుతూ సినీ అవకాశాలు వెతుక్కుంటూ వచ్చేలా చేశాడు.

హృతిక్ రోషన్

సోనాక్షికి ముందు చూపు

చాలా బొద్దుగా ఉండే సోనాక్షి సిన్హాకి నటనంటే చాలా ఇష్టం. చిన్న పాత్రకైనా గ్లామర్ లేనిదే బాలీవుడ్‌లో వర్కవుట్ అవదు. దీనికి సల్మాన్ మంత్రాతోనే వర్కవుట్లు మొదలెట్టి నాజూగ్గా మారిపోయింది సోనాక్షి. ఆమె అందానికే కాదు నటనకు గుర్తింపు తెచ్చేలా దబాంగ్‌ను ఆఫర్ చేసి సల్మాన్ గొప్ప లాంచ్‌ను అందించాడు.

అర్జున్‌కు మాస్‌స్టర్

సోదరి స్నేహితుడిగా ముందే పరిచయమున్న అర్జున్‌ది కూడా సోనాక్షి స్టోరీనే. సల్లూ నీళ్లు పడ్డాకే అర్జున్‌లో కూడా బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి పెరిగి పక్కా మాస్ హీరోలాగాను ప్రాజెక్ట్ చేసుకోగలిగాడు.

వీరే కాక కత్రినా కైఫ్, హిమేశ్ రెషమ్మియా జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇందర్ కుమార్, కమాల్ ఖాన్, పుల్కిత్ సమ్రాట్, అర్మాన్ మాలిక్, డైసీ షా, వినయ్ విర్మాని, జరీన్ ఖాన్ ఇలా ఎందరో స్టార్లకు కెరీర్ సెట్టర్‌గా మారాడీ పేరు వాడని గాడ్‌ఫాదర్. ●



సల్మాన్ ఖాన్

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

నెట్టిల్లు-నట్టిల్లు

గత కొంత కాలంగా ప్రధానమంత్రివర్యులు మోడీ గారు నిద్రలోనూ మెలకువలోనూ ఒకటే మాట కలవరిస్తున్నారు. అదే డిజిటల్ ఇండియా. విదేశీ వేదికలపైనా ఇదే పదే పదే పునరుద్ఘాటిస్తున్నారు. ఏ ఒక్క గ్రామీణుడినీ విడిచిపెట్టకుండా ... ప్రతి ఒక్క భారతీయుడికి ... ఇంటర్‌నెట్ కనెక్షన్ అందివ్వాలన్నది వారి కల. ఎంత గొప్ప కల! థింక్ బిగ్ అంటే ఇదేనేమో!

నెట్ అంటే ఏంటో ప్రత్యేకంగా వివరించాల్సిన పనిలేదివాళ. అయినా ఒక్క మాటలో చెప్పుకుంటే అదో తృప్తి. నెట్టుంటే అరచేతిలో ప్రపంచం కదలాడుతుంది. అంతరిక్ష యాత్ర మొదలుకొని ఆవకాయ జాడీ వరకు ... ఎట్లాంటి సమాచారం కావాలన్నా క్షణాల్లో కళ్ల ముందు నిలుస్తుంది. అన్ని రకాల అవకాశాలనూ అందిపుచ్చుకోవచ్చు. ఇక సోషల్ మీడియా సంగతి చెప్పేదేముంది?! ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సప్, ఇన్‌స్టాగ్రమ్...వంటివెన్నో ముని వేళ్ల కిందే కదలాడుతుంటాయ్. సమాచారం సచిత్ర సమేతంగా నిరంతరాయంగా బట్వాడా అవుతూనే వుంటుంది. చర్చోపచర్చలు సాగుతూనే వుంటాయ్. సమయం తెలీకుండా అలా గడిచిపోతూనే వుంటుంది. రాజకీయ నేతలు సైతం గెలుపుకోసం దీన్నే ఆశ్రయిస్తుంటారు. అందులో మోడీగారిది అందెవేసిన చెయ్యి. కారణం ఏదైతేనేం ప్రస్తుతానికి అర్ధ సహస్ర రైల్వే స్టేషన్లలో ఉచిత నెట్ సౌకర్యం ఏర్పాటు చేసే పనిలో మునిగితేలుతున్నారు ప్రధానుల వారు.

◆ మనలో మాట

❑ ❑ ❑

నెట్ ఓ సుందర ప్రపంచం. అందులో భిన్నాభిప్రాయం ఎవరికీ వుండదు. కాకపోతే...నెట్టింట్లో నుంచి ఒక్కసారి నట్టింట్లోకి వచ్చి చూస్తే ... కళ్లు తిరిగిపోయే వాస్తవాలు...కంటెదుట నిలుస్తాయి. మోడీగారు ఆశపడినట్టు... అందరికీ నెట్ రావాలంటే అన్ని చోట్లా కరెంటు వుండాలి. ఇప్పటికీ దేశంలో కరెంటు లేని ఇళ్ళు కుప్పలు తెప్పలు. కిరోసిన్ బుడ్ల వెలుతురులోనే రాత్రుళ్లు కరిగిపోతుంటాయి. నీళ్లు లేని పల్లెలు, నగరాలు అనంతం. ఎండా కాలం వచ్చిందంటే చాలు. బావులు, నల్లాల దగ్గర బిందెలతో బారులు తీరే మహిళలు కనిపిస్తారు. చుక్క నీటి కోసం సుదీర తీరాలు దాటే అతివలు అగుపిస్తారు. ఇక రోడ్ల సంగతి సరేసరి. వానాకాలం వచ్చిందంటే నరకమే. చినుకు రాలిన మరుక్షణం... రోడ్లన్నీ కాలవలుగా రూపాంతరం చెందుతుంటాయి. పుస్తకాల సంచులు భుజాన వేసుకున్న చిన్నారులు ప్రమాదకర మార్గాల్లో పాఠశాలలకు చేరుకుంటుంటారు. తిండి గింజల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. కేవలం ఇరవై రూపాయలతో కుటుంబం అంతా బతికే వారు కోట్లల్లో వున్నారు. ఇన్ని సమస్యలను పరిష్కరించకుండా కరెంటే లేని ఇళ్ళకు నెట్టు సౌకర్యం ఇస్తానంటున్నారు ప్రధానులవారు.

ఇంతకీ ఏది ముందు? నెట్టిల్లా? నట్టిల్లా? ఆ విషయం మోడీ సాబ్‌కి ఎందుకు తెలీటం లేదో మరి! ■



టపా

కఠిన హృదయాలకు నిదర్శనం

ప్రతి జీవి బతకడానికి కావలసినవి గాలి, నీరు, భూమి. నిరంతరం వానలు కురిసే చోట మనిషి నిక్షేపంగా బతకవచ్చు. రాణి గారి బావి చరిత్రలో మిగిలిపోతుంది. భానుమతి ఒక విలక్షణ నటి. ఒక వ్యక్తి ఆవేదనను అర్థం చేసుకుని ఆ వ్యక్తికి సపోర్టుగా నిలిస్తే ఆ వ్యక్తులు ఏ పనినైనా చేస్తారు అని చెప్పడానికి సరైన ఉదాహరణ రేఖ. సాగర మథనం కథ బాగుంది. ఏదైన నిర్ణయం తీసుకునే ముందు తన వారి గురించి ఆలోచించాలి, ముఖ్యంగా ప్రేమ విషయంలో. పెళ్ళైతే జీవితం. పెళ్ళి కాకపోతే ఒక గుర్తుగా ఉండాలి. క్షణికావేశానికి గురి కాకూడదు. సాగర్ మంచి పని చేశాడు. అన్నీ నేనే పాలకుల కఠిన హృదయాలకు నిలువుటద్దంగా నిలుస్తుంది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆముదాల వలస, శ్రీకాకుళం జిల్లా.

మనలాంటి వారే..

నేటి సమాజంలో మరగుజ్జులకు పెళ్ళిళ్లు కావడం కష్టంగా మారింది. సమాజంలో తమకు కూడా సరైన గుర్తింపు రావాలని ఉబలాటపడుతున్నారు ఈ మరగుజ్జులు. వారిని కూడా మనలాంటి మనుషులుగా గుర్తిద్దాం. సమాజంలో వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రస్తావించి వుంటే మరి కాస్త బాగుంది. ఈ సమాజంలో మగవారి చేతిలో మోసపోయే మహిళలకేం కొదవ లేదు. అలా మోసపోయిన వారి కోసం కెన్యాలోని ఉమోజా గ్రామంలో చాలా మంది ఆశ్రయం పొందుతూ నేటి ఆధునిక యుగానికి ధీటుగా జవాబిస్తున్నారు. ఇలాంటి విషయాలు మరిన్ని రావాలని ఆశిస్తున్నాం. మాల్గుడి డేస్ సీరియల్ ను నేను చూశాను. అది ఎక్కడ చిత్రీకరణ జరుపుకుందో తెలుసుకోవాలని ఉండేది.వానల లోగిళ్ళు చదవడం ద్వారా ఆ ప్రాంతమే గాక మిగతా వర్షారణ్య ప్రాంతాల గురించి కొత్త విషయాలను కూడా తెలుసుకున్నాం.

రాము, ఖాజీపేట, కడప.

శిల్ప సంపద సూపర్

క్రీ.శ 1022 వ శతాబ్దంలో నీటి విలువను, ఆవశ్యకతను ప్రతిబింబించేలా వుంది రాణిగారి బావి. ఆ కాలంలో నీటికి ఉన్న ప్రాధాన్యతను మనం గుర్తుకు తెచ్చుకోవచ్చు. అక్కడ శిలాసంపదను తీర్చిదిద్దిన తీరు అమోఘం. చరిత్రలో కలిసిపోతున్న వారసత్వ సంపదను కాపాడుకోవడం మన బాధ్యత. ఆలనాటి విశేషాలను గుర్తుకు తెచ్చారు.

శ్రీనాథ్, గంగాయ పల్లి, కమలాపురం,కడప

ఆదర్శప్రాయం

ముంబై అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది అక్కడి మురికి వాడల్లో నివశించేవారు. బాల్యం నుంచి చివరి మజిలి వరకు వారు అక్కడే గడుపుతారు. వారిలో చైతన్యం తీసుకువచ్చే తీరును 'ఆటలతో వంతెన' ద్వారా కళ్ళకు కట్టారు. చైతన్యం నింపే ఇలాంటి వ్యాసాలు మరిన్ని ఇస్తారని కోరుకుంటున్నాం. బాల నేస్తాల్లో మొత్తం ఎన్ని ఉన్నాయి? కనుక్కోవడంలో మా ఇంటిల్లిపాది మునిగిపోయాం.

జగదీష్, ఆముదాల వలస, శ్రీకాకుళం జిల్లా.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ :snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

వెరీ గుడ్డూ...

కవర్ స్టోరీ — 6

'అమ్మా! ఆకలి దంచేస్తోంది. ఇవాళ ఏం కూర?' అన్న పిల్లవాడికి 'కోడి గుడ్డు కూర' అన్న తల్లి సమాధానం ఎంత సంతోషాన్నిస్తుందో వర్ణించలేం. బుద్ధిగా కాళ్లు చేతులు కడుక్కుని మరీ పీట మీద కూర్చుంటాడా చిన్నారి భోజనానికి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పళ్లెంలో కోడిగుడ్డు కనిపించిన రోజు ఆ పసివాళ్ల కళ్లు ఎంతలా మెరుస్తాయో మాటల్లో చెప్పలేం. కేవలం ఆ చిన్ని గుడ్డు కోసమే ఆశగా బడికి రావడం వల్ల పిల్లల హాజరు శాతం పెరుగుతుంది. పప్పుచారులోకి ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు దట్టించి వేసిన ఆమ్లెట్ వడ్డిస్తే చాలు. పెద్దలు సైతం వంకలు పెట్టకుండా నాలుగు ముద్దలు ఎక్కువగానే లాగించేస్తారు.

జీవితం 3
పక్షి కేంద్రంలో రక్షా గైడులు

కళ 4
మరుభూమి మ్యూజియం

కార్టూన్ పంచ్ 5

ప్రత్యేకం 10
అగ్లీ దళం

నవ్వుల్ పువ్వుల్ 11

సినిమా కబుర్లు 14
తెలుగులో తొలి నేపథ్య గాయని

వింత లోకం 16
రోబో రెస్టారెంట్

స్ఫూర్తి 17
కాలి నడకన ప్రపంచాన్ని చుట్టి..

కథ 18
అమ్మంటే నాకిష్టం

రుచి 21
వంకాయతో వెరైటీగా...

బాల నేస్తాలు 22
శునక శకటం

కొత్త పుస్తకాలు 24
ఆరోగ్య సలహా దర్శిని

చూద్దామా -12
జేమ్స్ బాండ్ దీవులు

జీవితం

గూగులున్నా గైడ్ లేకుంటే పర్యాటక ప్రాంతాల్లో తిరిగినట్టు ఉండదు. ఒక్కో రాయి కథ, ఒక్కో చెట్టు కథ వారికి తెలిసినంతగా పర్యాటక శాఖ వారికి కూడా తెలీదేమో. ఏళ్ల తరబడి విషయాల్ని ప్రోది చేసుకుంటూ మరో కొత్త సంగతి చెప్పేందుకు ఉవ్విళ్లూరే గైడ్‌లు భరత్‌పూర్ పక్షి సంరక్షణ కేంద్రంలోను ఉన్నారు. రీసెర్చర్లు వెంట తీసుకుపోయే వీరంతా రిక్షా పుల్లర్లు.

పక్షి కేంద్రంలో రిక్షా గైడులు

చలికాలం వచ్చిందంటే భరత్‌పూర్ పరిసరాలు పక్షుల రెక్కల చప్పుడుతో బద్ధకంగా తెలవారుతుంటాయి. సూర్యోదయపు నులివెచ్చని స్పర్శకు ఎదురు చూసే విహంగాల గుంపులతో సందడిగా మారతాయి. ఆ ప్రభాత సమయాన అవి చేసే అందమైన అలజడిని చూసేందుకు కళ్లు నులుముకుంటూ అక్కడే ఎదురుచూసే పక్షి ప్రేమికులకు అంతకంటే గొప్ప దృశ్యం మరోటి ఉంటుందా? అదిగో అక్కడకు వెళితే ఉంటుందని వేలుపెట్టి చూయిస్తారు రిక్షా పుల్లర్లు. కంటికి అందకపోతే మీ బైనాక్యులర్‌ను సరిచేసి అటుగా మీ చూపుల్ని వాల్చేస్తారు. అద్దాల్లో చూడటం ఇష్టం లేకపోతే మిమ్మల్ని అక్కడకు చేర్చి తీరిగ్గా పక్షుల కిలకిలారావాల్లో మాట కలుపుతారు. పక్షులు గూళ్లు కట్టే చోట్లు, హాయిగా విహరించే ప్రదేశాలు, తిండికి వాలే ప్రాంతాలు, ప్రేమ గీతాలు పాడే తావులు ఇలా పక్షుల జీవనాన్ని కళ్లకుకట్టే ట్రిప్ చేయాలంటే ఈ రిక్షా పుల్లర్లనే సారథులుగా తీసుకెళ్లాలి. పేరుకే రిక్షా పుల్లర్లయిన వీరంతా మాంచి గైడ్‌లు కూడా. చూడ్డానికి చదువు అబ్బని వారిలా తోచినా పక్కా ప్రొఫెషనల్‌లు. హిందీ గిందీ, ఇంగ్లిష్ టింగ్లిష్ వచ్చే పర్యాకులుంటారో లేదో గానీ వీరి చక్కటి ఇంగ్లిష్ ఆశ్చర్యంలో పడేస్తుంది. అక్కడితో వీరి మాట కలపడం ఆగిపోదు. జర్మన్, ఫ్రెంచ్, ఇటాలియన్లలోను టచ్ ఉంది. విదేశీ పర్యాటకులకు వీరి రిక్షా ఎక్కితే నిశ్చింతే. గాట్టిగా ఒకే మాటనే పదే పదే పదిసార్లు అడిగి విషయాల్ని తెలుసుకోవాల్సిన బాధ లేదు. వీరి అరుపులకు పక్షులు ఎగిరిపోయే అవకాశమూ లేదు. అందుకే కొందరు ఫ్యాన్సు కూడా ఈ రిక్షావాలాలకు ఉంటారు. వారు ఎప్పుడు వచ్చినా తమ సొంతవారైనా గైడ్‌నే తోడు తీసుకెళు తుంటారు. ఓ పూట ఆలస్యమైనా పర్లేదు గానీ అభిమాన రిక్షావాలా వచ్చేంత వరకు వేచిచూస్తామని చెబుతారు. దశాబ్దాలుగా ఇదే వృత్తిలో పొట్ట నింపుకుంటున్న ఈ రిక్షా గైడ్‌లందరూ భరత్‌పూర్ సాంక్చురీని సొంతిళ్లుగా భావిస్తుంటారు. కేవలం పర్యాటకుల్ని తిప్పడానికే పరిమితం కాకుండా జూపార్క్‌ని సంరక్షించే బాధ్యతను భుజానేసుకున్నారు. చెత్త చెదారంతో నిండకుండా, ప్లాస్టిక్ వ్యర్థాలతో పక్షులకు అపాయం కలగకుండా పరిశుభ్రంగా ఉంచుతారు. సంరక్షణ కేంద్రంలోని పరిసరాల్లో ఏదైనా మార్పు వస్తే ఇట్టే పసిగట్టేస్తారు. వెంటనే అధికారులను అప్రమత్తం చేసి జీవజాలానికి ముప్పు కలగకుండా జాగ్రత్త పడుతుంటారు. ఓ వైపు పర్యాటకులకు అక్కడి పక్షి జాతుల సమాచారం చెబుతూనే మరో పక్క పరిసరాల్ని ఓ కంట కనిపెడుతూనే ఉంటారు. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఎవరైనా పక్షిశాస్త్రవేత్తలు, పరిశోధకులు వస్తే ముందుగా కలిసేది వీరినే. వారి పరిశోధనకు వీరి అమూల్యమైన సమాచారమే కీలకం. ఎన్నో డాక్యుమెంటరీల్లో వీరితో ప్రత్యేక ఇంటర్వ్యూలు తీసుకున్న సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. పక్షి ప్రేమికులు కూడా తాము అమితంగా ఇష్టపడే వాటి తావులు తెలుసుకోవడానికి వీరి సహాయాన్ని ఫోన్లలో అడిగి కూడా తెలుసుకుంటారు. ఏ కాలంలో వాటిని చూసే వీలు కలుగుతుందో సమాచారాన్ని సేకరించి ఇక్కడ వాలిపోతుంటారు. రోజంతా తమతో ఉంటూ అద్భుతమైన ఎన్నో క్షణాల్ని అందించినందుకు వీరితో స్నేహాన్ని పెంచుకునే వారు ఉంటారు. ఇలా ఈ రిక్షావాలాలు ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. అయితే గైడ్‌లుగా మారడానికి వారు చాలా కృషి, శ్రమే చేశారు. మూడు నెలల పాటు నిరవధికంగా సాగే శిక్షణలో పాల్గొని ఉత్తీర్ణత సాధించాకే వారిని గైడులుగా చెప్పుకుంటారు.

ది బెస్ట్

రాజస్థాన్‌కు చెందిన మహారాజ సూరజ్ మాల్ 250 ఏళ్ల క్రితం రెండు నదుల సంగమంలో నిర్మించిన బండ్ కారణంగా ఈ ప్రదేశం ఏర్పడింది. 1971లో ది కియోలాడియో ఘనా జాతీయ పార్కుగా ఈ సంరక్షణ కేంద్రాన్ని ప్రకటించారు. ఇది 336 రకాల పక్షిజాతులు, 370 రకాల పూల జాతులు, 96 రకాల జంతుజాతులతో నిండి ఉన్న పచ్చని తడినేల ప్రాంతమిది. వీటితో పాటు సైబీరియా మిగతా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వలస పక్షులకు కూడా ఇది ఆశ్రయమిస్తోంది. ప్రపంచంలోనే అతిసుందరమైన పక్షి కేంద్రంగా మన్ననలు పొందిన ఈ ప్రాంతం ప్రపంచ వారసత్వ సంపదగా కూడా గుర్తింపు పొందింది. 29 చదరపు కిలోమీటర్లు వ్యాపించిన ఈ ప్రదేశంలోని పార్కులో తొలి నుంచి కూడా ఇలా రిక్షాలలోనే సందర్శకులను స్పాట్లకు తిప్పుతున్నారు. అక్కడి వాతావరణం, పర్యావరణం దెబ్బతినకుండా మోటారు వాహనాలను నిషేధించారు. పదుల మైళ్ల దూరంలో ఉండే స్పాట్లకు చేర్చేందుకు రిక్షా తప్పనిసరి. సైకిళ్లు కూడా అద్దెకు ఇస్తున్నా ఒక్క మరుపురాని అనుభూతిని వదలకోకూడదనుకుంటే రిక్షాగైడులను ఆశ్రయించాల్సిందే. ఏటా లక్షమందికి పైగా సందర్శించే ఈ పార్కులో 100 మందికి పైగా రిక్షాపుల్లర్లు తమ సేవల్ని అందిస్తున్నారు.

కళాలోకం ప్యారిస్ కాళ్లకింద మరో కలకలం సృష్టించిన కళాఖండముంది. ప్రతి దాన్ని ఫ్యాషనబుల్‌గా మార్చుకునే ప్యారిస్ వాసులు చివరకు సమాధుల్నీ వదల్లేదు. సుమారు 60 లక్షల మంది పుర్రెలు, అస్తికలతో పదుల కిలోమీటర్ల సొరంగాల్ని మ్యూజియంగా మలిచారు. కేటాకోంబ్స్ ఆఫ్ ప్యారిస్‌గా పిలవబడే వీటి సృష్టి రెండు వందల ఏళ్ల క్రితమే జరిగింది.

మరుభూమి మ్యూజియం

◆ కళ

విక్టోరియన్ ఎరాకు ముందే ప్యారిస్ ఫ్యాషన్‌లతో కళకళలాడుతూ ఉండేది. పెదాలకు వేసుకునే రంగు నుంచి తలకు పెట్టుకునే టోపీల వరకు ఒక్కో ప్యారిస్ వాసిది ఒక్కో టేస్టు. ప్యారిస్ వీధుల్లో కొన్ని వందల ఏళ్ల క్రితం నడిచినా ఇప్పుడు విహరించినా సందర్శకునికి కలిగేది ఒకటే ఫీలింగ్. ఇక్కడి జనాలు కళను శ్వాసించి బతుకుతారేమో అని. కేవలం వీధుల్లోనే కాదు. ప్యారిస్ నగరం పునాదుల కింద కూడా కేటాకోంబ్స్ పేరిట ఓ అద్భుతాన్నే రూపొందించిన క్రెడిట్ వారికే దక్కుతుంది. సాధారణంగా ఎవరికైనా మానవ అస్తికలు గుంపులుగా కనిపిస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. కానీ, ఈ కేటాకోంబ్స్‌ను చూసిన వారికి ఓ కళావస్తువుగా ఆ దృశ్యం కనిపిస్తుంది. పిల్లల్ని సైతం తీసుకెళ్లి చూపించే సందర్శకులు లక్షలాది మంది ఏటా ఇక్కడకు వస్తుంటారు.

సొరంగాలపై నగర నిర్మాణం

ఇంతలా పేరొందిన ఈ కేటాకోంబ్స్ వెనుక ఓ పెద్ద కారణముంది. యుద్ధాలు, వ్యాధులు, కరువు వంటి ఎన్నో మృత్యుక్రీడల వల్ల పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించాయి. అక్కడి సమాధులు కిక్కిరిసిపోయాయి. ఎంతగా అంటే ఎప్పుడో పూడ్చి పెట్టిన అస్తిపంజరాల్ని వెలికితీసి వాటి స్థానంలో కొత్త వాటిని పూడ్చేంతగా. పాత వాటిని కుప్పలుగా స్మశానాల్లోనే ఓ మూలన పేర్చేవారు. అయినా స్థలం సరిపోక మరుభూమి విస్తరించుకుంటూ పోయేది. నాలుగో శతాబ్దం నుంచే పనిచేస్తున్న సమాధి స్థలాల్ని ఊరికి దగ్గరగా నిర్మించుకోవడంతో రానురాను పెరుగుతున్న నగరానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. వాటిని సుదూర ప్రాంతాలకు తరలించేందుకు మైనింగ్ తవ్వకాలు ఆటంకంగా నిలిచేవి. మరో అవకాశం లేక వాటి చుట్టూ మార్కెట్‌లు, ప్రధాన వీధులు పెరిగేవి. 1130లో బాగా కిక్కిరిసిపోయిన సెయింట్ ఇన్నొసెంట్స్ స్మశానాన్ని మూసేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క 12 శతాబ్దం నాటికి లుటేషియన్ సున్నపురాతి వెలికితీత కూడా భారీగానే సాగేది. అప్పట్లో సొరంగాల్ని తవ్వి బావుల గుండా రాతిని సేకరించి తరలించేవారు. చాలా భాగం కట్టడాలకు ఈ రాతినే వినియోగించారు. కొన్నేళ్లకు రాతి నిల్వలు తగ్గడంతో వాటిని విడిచారు. వందల ఏళ్ల తర్వాత ఈ విషయం మరిచిపోయిన ప్యారిస్ వాసులు నగరాన్ని విస్తరించారు. భారీ కట్టడాలకు పూనుకోవడంతో మరో చిక్కు సమస్య ఎదురైంది. 1774లో భూమి కుంగిపోయి భారీ భవంతులు కూలిపోవడంతో అప్పటి చక్రవర్తి కింగ్ లూయిస్ కారణం శోధించాలని నిపుణులను నియమించాడు. ఎప్పుడో మరిచిన సొరంగాల మీదుగా నగరం విస్తరించిందని, వాటిని పటిష్ట పరచకపోతే పెను ప్రమాదం జరుగుతుందని నివేదిక ఇచ్చారు. మరో సమస్య సెయింట్ ఇన్నొసెంట్స్‌లోని అస్తికలు రెండు మీటర్ల ఎత్తుకు చేరి చుట్టూ ఉన్న నివాస ప్రాంతాల్లో ప్రాణాంతక వ్యాధుల్ని కలుగజేసేది. ఈ రెంటికీ పరిష్కారంగా కొందరు అధికారులు ఓ మంచి ఆలోచనతో ముందుకు వచ్చారు. వాడుకలో లేని సొరంగాల్ని పటిష్టం చేసి నగరంలోని అన్ని సమాధి ప్రాంతాల్లోని అస్తికల్ని తరలిస్తే సమస్య తొలగుతుందని అప్పటి పోలీస్ లెఫ్టినెంట్ జనరల్ అలెగ్జాండర్ లెనోర్ చెప్పడంతో చక్రవర్తి అంగీకరించాడు.

కంకాళ కళ

1782లో ఈ తరలింపు కార్యక్రమం మొదలైంది. నల్ల గుడ్డ కప్పిన వేగన్లలో రాత్రుళ్లు తరలింపు చేపట్టగా సుమారు రెండేళ్లు పట్టింది.



సుమారు 60 లక్షల మందికి చెందిన అస్తికల్ని భద్రపరిచారు. వీటిని తరచూ చక్రవర్తి, ఇతర ప్రముఖులు సందర్శించడంతో వీటిని కళాత్మకంగా మార్చితే బాగుంటుందనే ఆలోచన లూయిస్ ఎటెన్ని హెరికార్ట్ డి తూరి చేశాడు. 1810 నుంచి సొబగులు అద్దడం మొదలెట్టాడు. గోడలను, ద్వారాలను, స్టోరేజీలను, మార్గాలను పుర్రెలు ఇతర భాగాలతో వివిధ కళాకృతుల్లో తీర్చిదిద్దాడు. ఇలా మరికొందరు కళాకారులు వారి ముద్ర వేసి వీటిని భయానకంగా కాక చూడచక్కగా మలిచారు. వీటిని ప్రజలూ సందర్శించాలనే ఉద్దేశంతో మ్యూజియంగా అభివృద్ధి చేశారు. అలా రెండు నెలలకు ఒకసారి, నెలకు ఒకసారి అంటూ సందర్శన వేళల్ని మార్చుతూ చివరకు రోజూ సందర్శించేందుకు అనుమతించారు. చర్చి నుంచి వచ్చిన విమర్శలతో 1833లో ఓ సారి మూసివేసినా తిరిగి 1850లో తెరిచారు. ఇక అప్పటి నుంచి ప్రపంచ నలుమూలల నుంచి సందర్శకులను ఆకట్టుకుంటూ ఓ ప్రత్యేక మ్యూజియంగా పేరు తెచ్చుకుంది. అయితే సందర్శకులను అనుమతించే ప్రాంతం కొంతే. చాలావరకు సొరంగ మార్గాల్ని మూసివేశారు. ఇలాంటి చోట్ల ఆకతాయిలు అక్రమంగా ప్రవేశించి వారి అడ్డాలుగా మార్చుకుంటున్న వార్తలు ఎక్కువగా వినిపిస్తుంటాయి. ఓ బృందమైతే ఏకంగా మినీ థియేటర్, బార్‌నే ఏర్పాటు చేసుకున్నారు. అసాంఘిక శక్తులకు అడ్డాగా మారుతున్న చోట్ల నిరంతర గస్తీ ఏర్పాటు చేశారు. కొందరు సాహసికులు అనుమతి లేని ప్రాంతాల్లోకి వెళ్లి దారి తప్పి సంఘటనలు చోటుచేసుకున్నాయి. జల్లెడ పట్టాల్సిన సొరంగాలు ఇంకా చాలా మిగిలే ఉన్నాయి. చెక్ రిపబ్లిక్, లండన్ వంటి ఇతర ప్రాంతాల్లో ఇలా భూగర్భ స్మశానాలున్నా ఇంత భారీ స్థాయిలో ఉన్నది ఇది ఒక్కటే. అందుకే దీన్ని ప్రపంచంలోనే అతిపెద్ద మరుభూమిగాను పిలుస్తారు.

✦

ఎందుకయ్యా.. వాటికే కష్టపడతావ్ ఆన్‌లైన్లో పిండుకో.. పాలు!!
?!
డిజిటల్ ఇండియా

మీలాంటి బడా వ్యాపారులు షాపులకి వస్తే మేం ఎట్లా బతకాలి?!
హెరిటేజ్
?!
పాలు, కూరలు అమ్ముకుని బతుకుతున్నాం లోకేష్


సింగపూర్ నుంచి వచ్చారట.. ఎవరికో ఎందుకు? మాకు తాకట్టు.. అదే అదే దత్తత ఇవ్వండని అడుగుతున్నారు సార్!!
గ్రామాలను దత్తత తీసుకోండి బాబు

కార్టూన్ పంచ్

ప్రత్యేక
హోదార్పు
దీక్ష

?!
శాంతి
PAK

◆ అట్ట మీది కథ

'అమ్మా! ఆకలి దంచేస్తోంది. ఇవాళ ఏం కూర?' అన్న పిల్లవాడికి 'కోడి గుడ్డు కూర' అన్న తల్లి సమాధానం ఎంత సంతోషాన్నిస్తుందో వర్ణించలేం. బుద్ధిగా కాళ్లు చేతులు కడుక్కుని మరీ పీట మీద కూర్చుంటాడా చిన్నారి భోజనానికి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పళ్లెంలో కోడిగుడ్డు కనిపించిన రోజు ఆ పసివాళ్ల కళ్లు ఎంతలా మెరుస్తాయో మాటల్లో చెప్పలేం. కేవలం ఆ చిన్ని గుడ్డు కోసమే ఆశగా బడికి రావడం వల్ల పిల్లల హాజరు శాతం పెరుగుతుంది. పప్పుచారులోకి ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు దట్టించి వేసిన ఆమ్లెట్ వడ్డిస్తే చాలు. పెద్దలు సైతం వంకలు పెట్టకుండా నాలుగు ముద్దలు ఎక్కువగానే లాగించేస్తారు. ఎలాంటి సణుగుళ్లు...గొణుగుళ్లు లేకుండా భోజన కార్యక్రమం ముగుస్తుందా రోజు. మనందరి మనసుల్లో అంతటి ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకున్న కోడిగుడ్డుకీ ఓ రోజు వుంది. ఆ సందర్భంగా కోడిగుడ్డుతో ముడిపడిన విశేషాలు...వినోదాల సమాహారం ఈ వారం అట్టమీది కథ.

వెరీ గుడ్డూ....

డా॥ కాకర్లమూడి విజయ్

ఆరోగ్యానికి కోడి మంచిదా? గుడ్డు మంచిదా? అంటే కోడి కంటే గుడ్డే మంచిది. మానవులు క్రీస్తు పూర్వం మూడు వేల రెండువందల సంవత్సరాల క్రితం నుండి గుడ్లను ఆహారంగా తీసుకుంటున్న దాఖలాలున్నాయి. ప్రాచీన ఈజిప్షియన్లు అడవి కోళ్ళను గుడ్ల కోసం మచ్చిక చేసుకున్నారట. యూరప్‌లో మాత్రం గుడ్ల వినియోగం క్రీస్తుపూర్వం ఆరు వందల ఏళ్ళ ప్రాంతంలో మొదలయింది. కోడి గుడ్డుకి పోషక విలువల రీత్యా విశేషమైన పేరు వుంది. బహుశా పాల తర్వాత అంత ప్రత్యేకతను పొందిన ఆహార పదార్థం గుడ్డు మాత్రమేనేమో. కోడి గుడ్డు తాలూకు పోషకాహారంగా ప్రాచుర్యం, అవగాహన కలిగించడానికీ, గుడ్డు సుగుణాలను అందరికీ తెలియచేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసపు రెండవ శుక్రవారాన్ని "వరల్డ్ ఎగ్ డే" గా పరిగణిస్తున్నారు. ఈ సంరంభం కొనసాగించాలని 1996లో వియన్నాలో నిర్ణయించారు. అక్టోబర్ తొమ్మిదిన మనం జరుపుకోబోయేది ఇరవయ్యవ ప్రపంచ గుడ్డు దినోత్సవం.

సుదీర్ఘ ప్రయాణం

సుమారు మూడు నాలుగు అంగుళాలుండే కోడి గుడ్డు అతి సూక్ష్మ అండం నుండి ఏర్పడుతుంది. ఒక గుడ్డు తయారవ్వడానికి కోడి లోపల ఇరవై నాలుగు నుండి ఇరవై ఆరు గంటలు తీసుకుంటుంది. పొదగబడిన ప్రతి కోడి పెట్ట లోనూ రెండు అండ కోశాలు వుంటాయి. కానీ ఎడమ వైపు అండ కోశం మాత్రమే గుడ్లను విడుదల చేస్తుంది. కుడి వైపు అండ కోశం కోళ్లలో పొదగబడిన వెంటనే అభివృద్ధి చెందటం ఆగిపోతుంది. అప్పుడే పుట్టిన కోడిపిల్లలో (మానవులలో కూడా!) అండ కోశంలో సుమారు నాలుగు వేల గుడ్లు వుంటాయి. కోళ్ళు పెరుగుతున్న కొద్దీ వాటిలో కొన్ని పచ్చ సొనగా మారతాయి. అండ కోశంలో అండం తయారవుతుంది. అది క్రమేపీ అండ వాహిక ద్వారా గర్భాశయాన్ని చేరుతుంది. దాదాపు రెండున్నర అడుగుల పొడవుండే ఆ మార్గంలోనే పచ్చ సొన చుట్టూ తెల్ల సొన ఏర్పడటం ప్రారంభమౌతుంది. అది పూర్తి అవ్వడానికి సుమారు మూడు గంటల సమయం పడుతుంది. అండ వాహిక మూడవ భాగంలో సొనల చుట్టూ పొరలు ఏర్పడతాయి. మరో గంటన్నర తరువాత చివరి ప్రయాణం

ఎగ్‌టాపింగ్

ఎగ్ బాక్సింగ్, ఎగ్ పికింగ్, ఎగ్ ఫైట్ వంటి పేర్లతో ఒక సరదా ఆట వుంది. ఉడక బెట్టిన గుడ్డు తో మరొకరి ఉడక బెట్టిన గుడ్డును నెమ్మదిగా కొట్టాలి. తమ గుడ్డు చిట్ల కుండా ఎదుటి వారి గుడ్డు పగలగొట్టడం ఈ ఆట ఉద్దేశం. ఇది ఇప్పుడు మంచి ఆటగా తయారయ్యింది. ఏ జాతి కోళ్ళు గట్టి పెంకు గల గుడ్లు పెడతాయో తెలుసుకోవడం, కోళ్ళకు కాల్షియం నిండిన దానా ఇచ్చి గట్టి పెంకు గుడ్లను వచ్చేలా చేయడం, ఒక ప్రత్యేక పద్ధతిలో గుడ్లను ఉడక బెట్టడం, పోటీ దారు గెలిస్తే ఆ గుడ్డుని ఒలిచి, తిని, ఎటువంటి మోసం లేదని నిరూపించాల్సి వుండటం వంటి అంశాల వల్ల ఇది యెంత సీరియస్ పోటీనో అర్థం అవుతుంది. ఈ ఆట మన అస్సాంలో కూడా 'కొని జూజ్' పేరుతొ ప్రతి ఏడూ ఏప్రిల్, జనవరి మాసాలలో ఆడతారు.

ఆటల పోటీలు

ఎగ్ హంట్ అనే ఆటలో అలంకరించిన గుడ్లను దాచి, పిల్లలను వాటిని వెతికి తెమ్మంటారు. ఎగ్ డాన్స్ కూడా ఈస్టర్ ఆటే. నేలపై కొన్ని గుడ్లను వుంచి అవి పగలకుండా వాటి మధ్య న త్యం చేస్తారు. ఈ ఆట జర్మనీలో ఆరంభమైంది. బ్రిటన్‌లో దీనినే హాప్ ఎగ్ అంటారు.

ఎగ్ రోలింగ్

ఇంగ్లాండ్ లో గుడ్లను చిన్న చిన్న గుట్టల పైనుండి కిందకు దొర్లించే ఆట వందల ఏళ్ళ నుండి వుంది. ఏటా గుడ్డు దొర్లించే పోటీలు కూడా జరుగుతాయి. ఇటువంటి వార్షిక పోటీ అమెరికాలో కూడా జరుగుతుంది. ప్రతి ఈస్టర్ సోమవారం నాడు శ్వేత సౌధం పచ్చిక బయళ్ళలో ఈ పోటీ నిర్వహిస్తారు. ఈ పోటీలో పిల్లలు పొడవాటి స్పూన్ వంటి వస్తువుతో గుడ్లను వేగంగా తోసుకుంటూ ముందుకు వెళ్ళాలి. అమెరికా అధ్యక్షుడు ఒబామా కూడా 2009లో ఈ పోటీకి ఆతిథ్యం ఇచ్చాడు.

మొదలౌతుంది. అలా ఏర్పడ్డ గుడ్డు అండ వాహిక చివరి భాగం చేరుతుంది. అక్కడ సుమారు ఇరవై గంటల పాటు పెంకు ఏర్పడుతుంది. ఏర్పడేటప్పుడు పెంకు మెత్తగా ఉంటుంది. ఆ తరువాత కాస్త గట్టి పడుతుంది. గుడ్లు వెడల్పు వైపు నుండి బయటికి వస్తాయి. ఒక గుడ్డు బయటికి వచ్చిన అరగంట కి మరో గుడ్డు ప్రయాణం మొదలౌతుంది. కోడి ఏటా సరాసరి మూడు వందల గుడ్లు పెడుతుంది. అండం విడుదల అయిన తరువాత సంపర్కం జరిగితే, ఆ గుడ్డు ఫలదీకరణ చెంది, మరో పిల్ల పుట్టుకకు కారణం అవుతుంది. కానీ ఫలదీకరణ జరగకపోయినా కూడా కోళ్ళు గుడ్లు పెట్టగలవు. అటువంటి గుడ్లు పొదగబడవు. సాధారణంగా, కోళ్ళ ఫామ్ నుండి వచ్చే గుడ్ల నుండి కోడి పిల్లలు రావు.

నిర్మాణమే ఓ అద్భుతం

ప్రాణం పోసుకున్న కొన్ని నిమిషాలలోనే, అతి బలహీనమైన కోడి పిల్ల అతి సునాయాసంగా గుడ్డు పెంకుని లోపలి నుండి పగలగొడుతుంది. బయటి నుండి కోడి గుడ్డుని మనం కూడా అలవోకగా పగలగొట్టవచ్చు. కానీ దానిని నిలువుగా ఉంచి నొక్కే ప్రయత్నం చేస్తే చాలా బలం కావాలి. అంత పటిష్టంగా తయారౌతుంది ఒక కోడి గుడ్డు. గుడ్డు పెంకు కాల్షియం కార్బొనేట్‌తో తయారౌతుంది. అది మొత్తం గుడ్డులో సుమారు పది శాతం బరువు వుంటుంది. ఈ పెంకు మన చర్మంలా అనేక సూక్ష్మ రంధ్రాలతో వుంటుంది. ఒక గుడ్డు పెంకులో సుమారు పదిహేడు వేల రంధ్రాలు వుంటాయి. వాటి ద్వారా గాలి, తేమ గుడ్డు లోపలికి ప్రవేశిస్తాయి, కానీ లోపలి ద్రవం మాత్రం బయటికి రాదు! ఈ పెంకు పైన బ్లూమ్ అనబడే మరో పొర రక్షణ పూతగా వుంటుంది. అది బ్యాక్టీరియా వంటి సూక్ష్మ క్రిములను లోనికి పోకుండా ఆపుతుంది. గుడ్డును కడిగితే ఈ బ్లూమ్ పొర తొలగిపోతుంది. పెంకు, లోపలి తెల్ల సొన మధ్య రెండు పారదర్శ పొరలు మరింత రక్షణ ను ఏర్పరుస్తాయి. అవి బాగా సున్నితంగా కనిపించినా, ధృడంగా వుంటాయి. అవి మన వెంట్రుకలలో వుండే 'కెరాటిన్' అనే ప్రోటీన్‌తో తయారైనవి. గుడ్డులో గాలి కూడా వుంటుంది! ముందు చెప్పుకున్న రెండు ప్రోటీన్ పొరల మధ్య, గుడ్డు వెడల్పు వైపు గాలి నిండి వుంటుంది. ఆ గాలి కోశం కూడా గుడ్డు కోడి నుండి బయటకి వచ్చి, లోపలి పదార్థాలు చల్లబడ్డాక ఏర్పడుతుంది. గుడ్డు వయసు పెరుగుతున్న కొద్దీ గాలి కోశం కూడా పెరుగుతుంది. గాలి కోశం ఒక రకమైన షాక్ అబ్జార్బర్ గా పనిచేస్తుంది. గుడ్డు లోని తెల్ల సొనని 'ఆల్బ్యుమెన్' అంటారు. లాటిన్ భాష లో 'అల్బస్' అంటే తెలుపు అని అర్థం. తెల్లగా (అది కొబ్బరి పాలలాగా వుంటుంది. ఉడికినపుడు మాత్రమే తెల్లగా మారుతుంది) వుండే సొనలో నీరు, దాదాపు నలభై రకాల ప్రోటీన్లు వుంటాయి! తాజా గుడ్లలో తెల్ల సొన కొబ్బరి పాల లాగా ఉంటుంది. నిల్వ వున్న గుడ్లలో అది నీరు లాగా వుంటుంది. చెడిపోయిన గుడ్లలో అది రంగు మారుతుంది. గుడ్డు మధ్యలో

వుండే పచ్చ సొన (దీనిని 'యోక్' అంటారు) గుండ్రంగా, బంతి లాగా వుంటుంది. దానిలో తెల్ల సొన కంటే తక్కువ నీరు, దాని కంటే ఎక్కువ ప్రోటీన్లు వుంటాయి. ఇందులోనే కొవ్వు, విటమిన్లు, ఇతర పోషకాలు వుంటాయి. పచ్చ సొన రంగు లేత బంగారు వర్ణం నుండి ముదురు నారింజ రంగు వరకూ అనేక రంగులలో ఉండవచ్చు. ఈ సొన రంగు కోడి తినే ఆహారాన్ని బట్టి, జాతిని బట్టి మారుతుంది. రెండు సొనల గుడ్లు అప్పుడప్పుడూ తారస పడతాయి. అటువంటి గుడ్లు మరీ చిన్న కోళ్ళు (ఇంకా పరిపక్వత రాని కోళ్ళు) పెడతాయి. వాటివల్ల ఎటువంటి ప్రమాదమూ, నష్టమూ, అనారోగ్యమూ కలగదు. గుడ్డులో తాళ్ళు కూడా ఉంటాయండోయ్! పచ్చ సొనని గుడ్డు మధ్యలో ఉంచడానికి 'షలాజే' అనే తాళ్ళు వుంటాయి. అవి పచ్చ సొనకి ఇరు వైపుల నుండి బయలుదేరి,

ఎగ్ డ్రాప్ పోటీ

విదేశాల్లో కొన్ని స్కూళ్ళలో ఎగ్ డ్రాప్ పోటీ పేరుతో ఒక ప్రయోగం చేస్తారు. ఈ ప్రయోగం లో పిల్లలు తమకిచ్చిన వస్తువులతో ఒక పరికరం తయారు చేయాల్సి వుంటుంది. ఆ పరికరం ద్వారా ఒక గుడ్డును కొంత ఎత్తు నుండి కిందకు వదిలినా గుడ్డు పగలకూడదు.

ఎగ్ టాసింగ్

ఈస్టర్ పండగ సందర్భంగా జర్మనీలో ఎగ్ టాసింగ్ లేదా ఎగ్ త్రోయింగ్ అనే ఆట ఆడతారు. ఇందులో గుడ్లను కొంత దూరం నుండి నేలపైకి విసిరితే, అవి పగలగూడదు. పచ్చిక ఉన్న ప్రాంతాలలో ఈ ఆట బాగా ఆడతారు. గుడ్లను విసిరేటప్పుడు క్రికెట్ బాల్ మాదిరి కాస్త తిప్పి విసిరితే గుడ్డు పగలదు. మధ్య యుగపు బ్రిటన్‌లో చర్చిల వద్ద ఈస్టర్ రోజున ఎగ్ టాసింగ్ పోటీ నిర్వహించేవారు. జూలై 4, 2011 న ఇదాహో నగరంలో 2,130 మంది పాల్గొన్న ఎగ్ టాసింగ్ పోటీ ప్రపంచ రికార్డు సాధించింది. డెల్ ఫాలీ అనే వ్యక్తి తాజా కోడి గుడ్డుని 323 అడుగుల 2 అంగుళాల దూరం విసిరి 1978 లో గిన్నిస్ రికార్డు కైవసం చేసుకున్నాడు. మరో ఇరవై ఏళ్ళ వరకూ ఈ రికార్డుని మరెవరూ దాటలేదు. ఆ తరువాత అసలు ఈ రికార్డునే పుస్తకం లో నుండి తొలగించారు. దాంతో ఇంగ్లాండ్‌లోని ప్రపంచ ఎగ్ త్రోయింగ్ సమాఖ్య స్వంతంగా రికార్డులను నమోదు చేస్తోంది. ఈ సమాఖ్య 2006 నుండి ప్రతి ఏడూ జూన్ చివరి ఆదివారం నాడు ఇంగ్లాండ్‌లో ప్రపంచ గుడ్డు విసిరే పోటీ ని నిర్వహిస్తుంది. గత ఏడాది మే నెలలో ఆండ్రీస్, బాకే సోదరులు గుడ్డుని 250.22 అడుగుల దూరం విసిరి ఈ సమాఖ్య రికార్డు ను కైవసం చేసుకున్నారు. ఎగ్ టాసింగ్ రెండు బందాల మధ్య కూడా జరుగుతుంది

గుడ్డు పెంకు కి లోపలివైపు పొరకి అంటుకొని వుంటాయి. ఆ తాళ్ళు యెంత స్పష్టంగా కనిపిస్తే గుడ్డు అంత తాజాగా ఉందని అర్థం. గుడ్డు రంగు కూడా దాన్ని పెట్టే కోడి బట్టి ఉంటుంది. తెల్లని 'లెగ్ హార్న్' జాతి కోళ్ళు (మనం వీటిని 'ఫాం' కోళ్ళ అంటాం) తెల్లని గుడ్లు పెడతాయి. రోడ్ ఐలాండ్ రెడ్ వంటి రకాలు (మనం వీటిని నాటు కోళ్ళు అంటాం) గోధుమ రంగు పెంకు ఉన్న గుడ్లు పెడతాయి. గుడ్డు పెంకు రంగు మారినా గుడ్డు లక్షణాలు, దానిలో పోషకాలు మారవు. తాజాగా ఉన్న గుడ్డులో పచ్చ సొన గుండ్రంగా ఉబ్బెత్తుగా వుంటుంది. గుడ్డు పగల గొట్టి ప్లేట్ లో వేసిన తరువాత తెల్ల సొన కాస్త చిక్కగా వుంటుంది, దాని మధ్యలో పచ్చ సొన ఉబ్బెత్తుగా ఉంటుంది. ఈ విధంగా వుంటే గుడ్డు తాజాగా ఉందని అని అర్థం. తెల్ల సొన మరీ పల్చగా ఉండి, ఎక్కువ దూరం వ్యాపించినా, పచ్చ సొన పల్చగా ఉండి ఉబ్బెత్తుగా లేకపోయినా ఆ గుడ్డు మంచిది కాదు. ఎంత చెప్పుకున్నా, గుడ్లు చాలా ఆహార పదార్థాల లాగే, ఎక్కువ కాలం నిల్వ ఉండవు. కాబట్టి వాటిని తక్కువ ఉష్ణోగ్రతలలో (ఫ్రిజ్‌లో) ఉంచుకోవాలి. ఫ్రిజ్ లో సుమారు మూడు నాలుగు వారాల పాటు నిల్వ వుంటాయి. ఏ మాత్రం సన్నని పగులు కనిపించినా, గుడ్డులో నుండి ద్రవం ఏదైనా కారుతున్నా దానిని వెంటనే పారవేయ్యాలి. ఫర్వాలేదులే అని వాడితే మాత్రం ప్రమాదం. సాధారణంగా గుడ్ల ను మనం మార్కెట్ నుండి తెచ్చుకుని అలాగే వాడేస్తాము. ఎలాగూ మనం వాడేది గుడ్డు లోపలి పదార్థాన్నే కాబట్టి గుడ్డు

బయట ఎలా వున్నా పెద్దగా పట్టించుకోం. కానీ, గుడ్డుని వాడే ముందు కడగాలి. తాజాగా పెట్టిన కోడి గుడ్లపై ఒక సహజమైన పొర పూతలాగా వుంటుంది. ఆ పూత కూడా అంత మంచిది కాదంటారు. అందుకే అమెరికాలో గుడ్లను మార్కెట్లో అమ్మేముందే ఆ పూతను శుభ్రంగా కడిగివేయాలనే నిబంధన వుంది. అయితే అలా కడిగి వేయడం వలన అవి ఎక్కువ కాలం నిల్వ వుండవు. అందుకనే అమెరికా లో ని గుడ్లని ఎప్పుడూ ఫ్రిజ్‌లో వుంచవలసి వస్తుంది. యూరప్‌లోనూ, మన దేశం లోనూ గుడ్లని శుభ్రపరచి అమ్మే అలవాటు లేదు. అందువలన అవి బయటనే కొన్ని రోజులు నిల్వ వుంటాయి.

అత్యధిక గుడ్ల ఉత్పత్తి దేశాలు

ప్రపంచ వ్యాప్తంగా గుడ్లు/కోళ్ళ పరిశ్రమ బాగానే వ్యాపించింది. ఆరు నెలల క్రితం సమాచారం ప్రకారం చైనా 2,88,00,000 టన్నుల గుడ్లు ఉత్పత్తి చేసి మొదటి స్థానంలో వుంది. ఆ తరువాతి స్థానంలో 1,22,00, 000 టన్నులతో మన దేశం, మన తరువాత 13,00,000 టన్నుల గుడ్ల ఉత్పత్తితో ఇరాన్, ఆ తరువాత వరుసగా ఈజిప్ట్, టర్కీ, ఇండోనేషియా, ఇరాక్, జపాన్, స్పెయిన్, ఇటలీలు వున్నాయి. గుడ్లు ఆహారంగా తీసుకోని దేశాలు/జాతులు బహుశా లేవు ఒక్క జైనులు తప్ప. జైనులు జీవ హింసను వ్యతిరేకిస్తారు. సూక్ష్మ జీవులు ముక్కులో ప్రవేశిస్తాయని గుడ్డ కట్టుకుంటారు, మొక్కల వేర్లలో జీవులు ఉంటాయని ఆ ఆహారాన్నీ తీసుకోరు. ఇతరత్రా శాకాహారులు కూడా గుడ్డుని మినహాయించారు. ఒక జీవి నుండి 'వస్తుంది' అనే అంశం తప్ప ఒక జీవిని 'చంపుతున్నాము' అనే సమస్య గుడ్డులో లేదు. ఎందుకంటే ఫాం గుడ్లు ఫలదీకరణ చెందని గుడ్లు. అందులో జీవం లేదు.

ఎగ్ సేల్

డచ్ దేశంలో పిల్లలు ఎగ్ సేల్ అనే ఆట ఆడేవారు. ఈ ఆటలో పిల్లలు గుడ్లను మరొకరికి అమ్మాలి. అలా కొన్న వారు గుడ్డుని గడ్డి లో విసరాలి. ఒక వేళ ఆ గుడ్డు పగలక పోతే దాన్ని తిరిగి అమ్మిన వారికి ఇచ్చెయ్యాలి.

కోడి ముందా గుడ్డు ముందా?



పక్షులు తమ ముందు ఆవిర్భవించిన సరీసృపాల నుండి ఉద్భవించాయని పరిణామ శాస్త్రం ఆధారాలతో సహా నిరూపించింది. భారీ సరీసృపాలైన డైనోసార్ల రూపాల నుండి పక్షులు ఆవిర్భవించాయి. డైనోసార్లు గుడ్లను పెట్టి పొదిగేవి. ఆ క్రమంలోనే పక్షులూ వచ్చాయి కాబట్టి ముందు గుడ్డే వచ్చింది. గుడ్డు నుండే నిజమైన పక్షులు వచ్చాయి.

కానీ మనం మాత్రం వాడే ముందు గుడ్లను శుభ్రంగా కడగటం మంచిది. ప్రపంచ వ్యాప్తంగా నూట ఇరవై వేల కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. సగటున ప్రతి మనిషి ఏటా 173 గుడ్లు ఆహారంగా తీసుకుంటాడు.

పోషకాల గని

మామూలుగా ప్రోటీన్లు ఖరీదైనవి. పాలు, మాంసం వంటివి ప్రోటీన్లను అందిస్తాయి. కానీ గుడ్లు మాత్రమే అధిక నాణ్యత గల ప్రోటీన్లు అందించే అతి చవకైన ఆహారం. ఒక్కో గుడ్డులో ఆరు గ్రాముల అత్యంత నాణ్యమైన ప్రోటీన్ ఉంటుంది. తెల్ల సొనలో ప్రోటీన్, విటమిన్ డీ2, D, B 6, B 12, సెలీనియం, జింక్, ఇనుము, రాగి వంటి ఖనిజాలు వుంటాయి. పచ్చ సొనలో ఎక్కువ క్యాలరీలు, ఎక్కువ కొవ్వు, ఎక్కువ కొలెస్ట్రాల్ (తెల్ల సొన కంటే) వుంటాయి. వాటితో పాటు విటమిన్ A, D, E, K, లెసిథిన్, కోలిన్ కూడా లభిస్తాయి. కొలీన్ శరీర కణాల అభివ ద్ధికి, కాలేయ పనితనానికి, పిండ దశలో మెదడు పనితనానికీ తోడ్పడుతుంది. గుడ్డులో రెండువందల యాభై మిల్లీ గ్రాముల కొలీన్ వుంటుంది. గుడ్డులో మానవులకి ఆవశ్యకమైన అన్ని అమినో ఆమ్లాలూ వున్నాయి. ఇన్ని పోషకాలు వున్నా గుడ్డు ఇచ్చే క్యాలరీలు మాత్రం బహు స్వల్పం. ఒక గుడ్డులో కేవలం 75 క్యాలరీలు మాత్రమే ఉంటాయి. గుడ్డు లోని కొవ్వులో అధిక భాగం ఆరోగ్యకరమైన 'అసంతప్త' రకానికి చెందినది. పైగా, గుడ్డులో చెక్కర పదార్థాలు, పిండి పదార్థాలు (కార్బోహైడ్రేట్) అస్సలు ఉండవు. కాబట్టి గుడ్డు తింటే లావు అయిపోతామనే భయం లేదు. ఇందులోని కొలెస్ట్రాల్ కూడా హానికరం కాదని పరిశోధనలు నిరూపించాయి. పిల్లల ఎదుగుదలకూ, గుండె ఆరోగ్యానికీ, మెదడు పనితనానికీ, కండరాలు పెంచడానికి, తక్కువ ఆహారంతో ఎక్కువ ప్రోటీన్లు అందించడానికీ, రోజులో ఏ సమయంలో అయినా, ఏ వయసు వారైనా, హాయిగా తీసుకోగలిగే అద్భుత ఆహారం గుడ్డు. శరీరంలో వ్యాధి నిరోధక శక్తి బలపడుతుంది.కంటి చూపు మెరుగు పరుస్తుంది. బరువు తగ్గడంలో సహాయ పడుతుంది. పచ్చ సొన ద్వారా విలువైన విటమిన్ డి లభిస్తుంది.

కేవలం ఆహారంగానే కాకుండా గుడ్లు అనేక ఇతర విధాలుగా కూడా ఉపయోగ పడతాయి. తెల్ల సొనని బాగా గిల కొట్టి కేక్‌ల తయారీలో వాడతారు. అందువల్ల కేక్‌కు ఆ గుల్లతనం వస్తుంది. సూప్‌లను చిక్కగా చెయ్యడానికి తెల్ల సొన కలుపుతారు. ఇవి కాక, జిగురుల తయారీలో, సౌందర్య సాధనాలలో, షాంపూలలో, ఇంకులలో, పెయింట్‌లలో కూడా గుడ్లు వాడతారు. వీటిని టీకాల తయారీలోనూ వాడతారు. గుడ్డు పెంకులతో రకరకాల బొమ్మలు తయారు చేస్తారు, అలంకరణలూ చేస్తారు.పెంకులను మొక్కలకు ఎరువుగా కూడా వాడతారు. ✦

గుడ్లు-డజన్ లెక్క

గుడ్లను డజన్ల లెక్కలో అమ్మడం కొనడం మన ప్రాంతాలలో పరిపాటి. ఈ లెక్క చాలా కాలం క్రితం నుండి అమలులో వుంది. ఇంగ్లీషు వారు తమ కొలతల్లో పన్నెండుని బాగా ఉపయోగించేవారు. అడుగుకి పన్నెండు అంగుళాలు, ఒక షిల్లింగ్‌కి పన్నెండు పెన్నీలు వంటివి ఇప్పటికీ ఉన్నాయి. ఒక షిల్లింగ్ కి పన్నెండు గుడ్లు వచ్చేవేమో. బహుశా ఆ లెక్క నుండే డజను గుడ్లు వచ్చాయి కాబోలు. ఇప్పుడు డజన్లు అన్ని ప్రాంతాలలోనూ అమలులో లేవు. చాలా దేశాల లో గుడ్లు పదుల లెక్కన కూడా ఇస్తారు. కొన్ని దేశాలలో గుడ్లు బరువు/సైజు ప్రకారం అమ్ముతున్నారు. గుడ్లను వాటి సైజుల వారీగా ధర నిర్ణయిస్తారు.

సంప్రదాయాలలో....

చాలా సంప్రదాయాలలో గుడ్డుకి స్థానం వుంది. సారానికీ, సమృద్ధికీ, సంతోషానికీ నిదర్శనంగా గుడ్డుని భావిస్తారు. యూదులూ, జొరాష్ట్రియన్లూ గుడ్ల పెంకులపై అందమైన రంగు రంగుల బొమ్మలతో అలంకరిస్తారు. పదమూడవ శతాబ్దం లోనే గుడ్లను అలంకరించడం అనే ఆచారం వుండేది. ఈస్టర్ పండుగ అదే. ఉపవాసాలు ముగిసిన సందర్భంగా గుడ్లను అలంకరించి ఒకరికి ఒకరు ఇచ్చి పుచ్చుకుంటారు. వాటినే ఈస్టర్ ఎగ్స్ అంటారు.

ప్రత్యేకం

అగ్లీ దళం

అగ్లీ ఇండియన్స్ కొత్త ఇండియాని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. చెత్తా చెదారంతో, కిళ్లీ మరకలతో, మూత్ర విసర్జనతో కంపు కొడుతూ, కడుపు దేవేసే వీధుల్ని, దారుల్ని మకిలి వదిలేట్టు స్పాట్ ఫిక్స్ చేస్తున్నారు. వినూత్న పరిష్కారాలతో అందమైన విహారాల్లా మార్చేస్తున్నారు. ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్.. గట్టి మేలు తలపెట్టవోయ్ అంటూ నగర వీధుల దుమ్ము దులుపుతున్నారు.

ఫుట్‌పాత్‌పై వెళుతుంటే దారి మధ్యలో భారీగా పేరుకుపోయిన చెత్త.. వెంటనే నోటి వెంట వచ్చే మాట. ఛీ ఈ జనాలకు చెత్త ఎక్కడ వేయాలో కూడా తెలీదని. పిల్లల్ని తీసుకుని పబ్లిక్ పార్క్‌కు వెళితే ఎవరో చెట్ల మాటున గోడపై పొత్తి కడుపు భారాన్ని దించేస్తుంటారు. వెంటనే మనసులో తిట్టుకునే మాట.. వీడికి కొంచెం కూడా బుద్ధి గానీ, సిగ్గూ గానీ లేదని. ఇలా తిట్టుకుంటూ విసుక్కుంటూ వాదులాడుకుంటే ఏ మార్పు రాదనేది అగ్లీ ఇండియన్ల సిద్ధాంతం.

వినూత్నంగా ....

కంపు భరిస్తూ, చెత్త పైనుంచి దూకుతూ దారెంట వెళ్లే కంటే అవి మళ్లీ అక్కడ కనిపించ కుండా చేయడానికి చీపురు పట్టమంటారు వీళ్లు. తక్కువ ఖర్చుతో, సులువైన ఆలోచనతో ఆ దారుల పరిస్థితి మార్చేందుకు తమ జట్టులో కలవమంటారు. తెలిగ్గా ఉపయోగించేలా, వినూత్న పరిష్కారాలతో ఈ సమస్యల్ని తరిమేయాలనేది వారి సంకల్పం. కామన్ సెన్స్‌తో స్పాట్ ఫిక్స్ ద్వారా సమస్యకు చురుకైన పరిష్కారం అందిస్తున్నారు. కిళ్లీ మరకలు కనిపించకుండానే కాదు కిళ్లీలు గోడలపై ఉమ్మి వేయకుండా ఎర్రటి రంగుతో మకిలి పట్టిన గోడలపై ఆహ్లాదకరమైన చిత్రాలు గీస్తున్నారు. వీధి మూలల్లో పేరుకున్న చెత్తను తొలగించి మళ్లీ ఎవరు చెత్త వేయకుండా మొక్కల్ని నాటి అందమైన ముగ్గుల్ని వేస్తున్నారు. విరిగిపోయిన, పాడైపోయిన ఫుట్‌పాత్‌లు, సూయేజ్‌లు, డ్రైనేజీలను బాగు చేస్తారు. కంపుతో, చెత్తతో ఫుట్‌పాత్ విడిచి రోడ్డుపై నడిచే వారిని ఆకట్టుకునేలా వాటిని అందంగా అలంకరిస్తున్నారు. బెంగళూరు వీధుల్ని మారుస్తున్న ఈ అగ్లీ ఇండియన్స్ దేశమంతా విస్తరిస్తున్నారు.

పరిశుభ్రతకు పట్టం

2010లో బెంగళూరు నుంచి మొదలైన ఈ అగ్లీ ఇండియన్స్‌ను ప్రారంభించింది ఎవరో తెలీదు. తెలియనివ్వరు. వారికి కావాల్సిందల్లా పరిశుభ్రత మాత్రమే. పేరు, భజన కాదు. కేవలం ఈ మెయిల్, ఫేస్‌బుక్ ద్వారానే వారీ కాంపెయిన్‌ను దేశమంతటా విస్తరించారు. లూథియానా, వైజాగ్, ఢిల్లీ, ముంబై, చెన్నై, గోవా, ఆగ్రా, కాన్పూర్, హైదరాబాద్, పూణె వంటి ప్రధాన నగరాల్లో వీరు అద్భుతాలే సృష్టిస్తున్నారు. వీరి స్ఫూర్తిగా 'విజయవాడ నీడ్స్ యూ' అనే బృందం ఆంధ్రా రాజధాని దుమ్ము దులిపింది. తెలుపు టీషర్ట్‌లు, మాస్క్‌లు, క్యాప్‌లతో సమస్యను గుర్తించిన చోటకు వెళ్లి బాగుచేసే అగ్లీ ఇండియన్స్‌లో ఒకరికి ఒకరు తెలీదు. కనీసం పేరు కూడా తెలీదు. వచ్చిన ఈ మెయిల్ ద్వారా చెప్పిన ప్రాంతానికి తరలిపోయేవారు కొందరైతే, మిత్రులతో కలిసి స్పాట్ ఫిక్స్ చేసి పోస్ట్‌లు పెట్టేవారు కొందరు. సభ్యులుగా చేరేందుకు పంపిన ఈ మెయిల్స్ ద్వారా సమానంగా స్త్రీ, పురుష వలంటీర్లను ఎంపిక చేసి లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. కనీసం మూడు నెలల సమయం పాటు పనికి వచ్చే ఐడియాల్నే వర్కవుట్ చేస్తారు. వీరి కష్టం వృథా కాలేదు. మూడు నెలలు దాటి కూడా మళ్లీ చెత్త వేయని, కిళ్లీలు ఉమ్మి వేయని స్పాట్లు ఎన్నో ఉన్నాయి. చూడముచ్చటగా తీర్చిదిద్దిన ఆ దారుల, గోడల అందాల్ని చెడగొట్టడం ఇష్టంలేక చాలామంది పక్కనే ఉన్న ఉమ్మి తొట్టెలను, డస్ట్ బిన్‌లను, యూరినల్స్ పాయింట్లను ఉపయోగిస్తున్నారు. వీళ్లు తమ కార్యక్రమాల కోసం నిధుల్ని సేకరించరు. వలంటీర్లే వారికి తోచిన విధంగా పనుల్లో సాయపడుతుంటారు. నిధులివ్వాలనే వారిని డబ్బు రూపేణా కాక ఆ స్పాట్లను దత్తత తీసుకునేలా ఒప్పిస్తారు. వాటి నిర్వహణ చూడాల్సిన బాధ్యత అప్పగిస్తారు. తెలుసుకోవాల్సిన విషయమేమిటంటే రోజూ పర్యవేక్షించాల్సిన అవసరం లేకుండా ఓ స్పాట్‌ను ఫిక్స్ చేస్తారు. వీళ్లు అభివృద్ధి చేసిన నీటి అవసరం లేని పర్యావరణ హిత యూరినల్స్ వండర్‌లూ, చెత్త వేసే తేరే బిన్‌లు బాగా పనిచేస్తున్నాయి. ఐదేళ్ల ప్రస్థానంలో వందలాది స్పాట్లను ఫిక్స్ చేసి ఆహ్లాదకరమైన నడక దారి అనుభూతిని కలిగిస్తున్నారు. పాకిస్తాన్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, తూర్పు యూరప్ దేశాల నుంచి స్పందన వస్తోంది. ఆయా దేశాల్లోను అగ్లీ ఇండియన్స్ తరహా కాంపెయిన్లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పేరులో మాత్రమే అగ్లీ ఉన్న ఈ ఇండియన్స్ నిర్మలమైన భారతావని కోసం సరైన పంథానే ఎంచుకున్నారు. ప్రభుత్వాన్ని, పక్కవాడిని తేలిగ్గా వేలెత్తి చూపించే వాళ్లు అధిక ప్రసంగాలు ఆపి తమ వంతు పనిని చేసి చూపించాలనేది వీరి నినాదం.

నవ్వుల్ – పువ్వుల్

మంచి స్థితి

శ్యామ్: మా మామయ్య కింద 500 మంది ఉంటారు తెలుసా?
భీమ్: ఓహో అలాగయితే మీ మామయ్య చాలా మంచి స్థితిలో ఉన్నట్లే లెక్క
శ్యామ్: అదేం లేదు. తను శ్మశానంలో కావలి కాస్తుంటాడులే.

ఫారినర్స్



ఒకసారి ఒక ఫారినర్ ఇండియాలోని ఒక పల్లెటూరికి వస్తాడు.అక్కడ ఒక చిన్న కాకా హోటల్‌లో ఎగ్ ఆమ్లెట్ తిని బిల్లెంత అని అడుగుతాడు
పల్లెటూరి వ్యక్తి: రెండొందలు
ఫారినర్: రెండొందలా? అదేంటి, మీకు ఇక్కడ ఎగ్స్ దొరకవా?
పల్లెటూరి వ్యక్తి: ఓ ఎందుకు దొరకవూ? కాని ఫారినర్స్ దొరకరు.

బెండకాయ కూర

ఈ రోజు మీ ఇంట్లో బెండకాయ కూర చేశారు కదూ వదినా?
అరె అంత కరెక్టుగా ఎలా చెప్పగలిగారు
రాత్రి మా ఇంట్లో దొంగలు పడి బెండకాయలు కూడా కోసుకెళ్లారులే....!!!

నెక్స్ట్

జంభులింగం: డాక్టర్ మీరే నాకు సహాయం చెయ్యాలి. నేను మాట్లాడుతుంటే ఎవ్వరూ నా మాట వినట్లేదు. నా మాట అంటే ఎవరికి లెక్క లేకుండా పోతుంది...
డాక్టర్: నెక్స్ట్ ప్లీజ్.........

పరీక్ష

నలుగురు స్టూడెంట్స్ అర్ధరాత్రి వరకు ఆడుకొని పరీక్ష సిద్ధం అవకుండా తెల్లారి ఒక ఉపాయం ఆలోచిస్తారు.
తమ బట్టలకు బాగా దుమ్ము, గ్రీజు అంటించుకొని ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్తారు.
రాత్రి ఒక పెళ్ళికి వెళ్ళి తిరిగి వస్తుంటే కారు పంక్చరైంది. దాన్ని తోసుకుని హాస్టల్‌కు వచ్చే సరికి తెల్లారింది సార్ అని చెబుతారు.
ప్రిన్సిపాల్ సరే అని మూడు రోజుల తర్వాత వాళ్ళకి మళ్లీ పరీక్ష పెడతానంటాడు.
మూడు రోజుల తర్వాత నలుగురిని తలా ఒక గదిలో కూర్చోబెట్టి వాళ్లకి క్వశ్చన్ పేపర్ ఇస్తాడు.
ప్రశ్నాపత్రం
పరీక్ష ప్రశ్నా పత్రంలో వంద మార్కులకు రెండు సమాధానాలు వ్రాయాలి
1. నీ పేరు........
2. కారు ఏ టైరు పంక్చరైంది?
ఎ) ముందు కుడి చక్రం బి) ముందు ఎడమ చక్రం
సి) కుడి చక్రం వెనుక డి) ఎడమ చక్రం వెనుక

అదృష్టం

మోహన్: అదృష్టం కొద్ది నాకివాళ వందరూపాయలు దొరికాయి నాన్నా
తండ్రి: ఆహా. పండగ చేసుకో..ఇంతకీ ఎక్కడ దొరికిందో అది?
మోహన్: ఇంట్లోనే.... మీ చొక్కా జేబులోనే నాన్నా......

చైనీస్ హోటల్

డబ్బు లేకుండా చైనీస్ హోటల్‌కి వెళ్ళి టిఫిన్ చేయడం పొరపాటైంది అని వాపోయాడు రాజేష్.
ఏం చేసారేమిటి అడిగాడు సురేష్.
20 పాముల్ని నా దగ్గర పడేసి వాటి చర్మాన్ని వలవమన్నారు అని బోరున ఏడ్చేశాడు.

జేమ్స్ బాండ్ దీవులు

థాయ్‌ల్యాండ్‌లోని ఫాంగ్ గ్నా ప్రావిన్స్ చూపు తిప్పుకోనివ్వని ప్రదేశాలకు ఆలవాలం. లక్షలమంది విదేశీ సందర్శకులు పోటెత్తే పర్యాటక స్వర్గం. విశాలమైన బీచ్‌ల్లో పాశ్చాత్య పోకడలు ఒకవైపు ప్రాచీన ఆలయాలతో గొప్ప సాంస్కృతిక వైభవం మరోవైపు థాయ్‌ల్యాండ్ ట్రిప్ విలువను అమాంతం పెంచేస్తాయి. విహారానికి పెట్టిన ఖర్చుకు న్యాయం జరిగినట్టు నిశ్చింతగా ఉంటుంది. అదే థాయ్‌ల్యాండ్‌లో కేవలం బీచ్‌లే కాక మరో అద్భుతం ఆహ్వానం పలుకుతుంది. అదే జేమ్స్‌బాండ్ ఐలాండ్ ద్వీప సముదాయం.

అండమాన్ సముద్ర ప్రాంతంలోకి వచ్చే క్రాంబీ, ఫాంగ్ గ్నా, పుకెట్‌లు సందర్శకుల తాకిడితో నిండిపోతాయి. ఇక్కడి మడ అడవుల చిక్కటి పచ్చదనం మధ్య నుంచి కనోయింగ్ చేస్తూ సముద్రంలోకి చేరాక ఓ అద్భుతం ఆవిష్కారమవుతుంది. చుట్టూ పరుచుకున్న పచ్చదనం ఒక్కసారిగా మాయమై సముద్ర లోకంలో జారవిడుస్తుంది. ఫాంగ్ గ్నా తీరం 400 కిలోమీటర్ల మేర గుర్రపు నాడా ఆకారంలో విస్తరించి ఉండగా లోనికి చొచ్చుకువచ్చిన సముద్రపు నీరు, దానిలో కలిసేందుకు నదీ పాయలు మడ అడవుల మధ్య నుంచి సన్నని మార్గాల గుండా వస్తుంటాయి. తక్కువ లోతు ఉండే విశాల సముద్ర భాగమంతా పచ్చగా మెరిసిపోతుంటుంది. దానిలో అనేక భంగిమల్లో చిన్నపాటి కొండలు పడవల్లా తేలుతున్నట్టు కనిపిస్తాయి. వందల సంఖ్యలో ఉండే సున్నపురాతి కొండలు దీవుల్లా మారి ఓ కొత్త లోకంలోకి తెడ్డు వేస్తాయి. చిన్నచిన్న సున్నపురాతి ద్వీపాలు, తెల్లటి ఇసుక బీచ్‌లతో అవి పైరేట్‌ల ప్రపంచాన్ని తలపిస్తాయి. వీటిలో ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత ఉండటంతో పలు విషయాల్లో గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకున్నాయి. పచ్చల రత్నం రంగులో తళతళలాడే సముద్ర జలాలు చాలా ప్రశాంతంగా ఉంటాయి. కొన్ని మీటర్ల లోతు మాత్రమే ఉండే ఈ జలాలు ఎన్నో అద్భుతాలకు నెలవు. రుతుపవనాలు ఈ ప్రాంతం మీదుగా వెళతాయి. ఏడాదిలో 200 రోజులు వర్ష వాతావరణం కనిపిస్తుంది. వర్షం తాకిడికి, అలల దెబ్బకు, ప్రవాహాల ఒరిపిడికి కరిగి సున్నపు రాతి కొండలు వివిధ భంగిమల్లో కనువిందు చేస్తాయి. ఒక్కో ద్వీపం ఒక్కో అద్భుతాన్ని దాచుకుని పర్యాటకులకు ఒక్క ట్రిప్‌లో ఎన్నో అనుభూతుల్ని మిగులుస్తాయి. కొండల పగుళ్లలోకి వేళ్లను అల్లి పచ్చదనం దుప్పటి కప్పే ప్రత్యేక వృక్షజాతులు ఇక్కడ కోకొల్లలు. అవి పెనవేసుకుపోవడం వల్లే ఆ కొండలు మరింత అందంగా ఆశ్చర్యంగా అనిపిస్తాయి. దూరం నుంచి చూస్తే రాతిపై నాచు పేరుకున్నట్టు తోస్తుంది ఆ దృశ్యం. ఈ అద్భుతాలను వీక్షించేందుకు చాలా మంది హెలికాప్టర్ ప్రయాణాన్ని చేస్తారు. కొందరు వాటర్ రాఫ్టింగ్‌కు ఉత్సాహపడతారు. మడ అడవుల మధ్య నుంచి కాలువలు మోసుకొచ్చే వరద మట్టితో ఈ సముద్ర ప్రాంతం నిండిపోవడంతో ఇక్కడి సముద్ర గర్భం కొద్ది మీటర్ల లోతే ఉంటుంది. స్కూబా డైవింగ్‌కు అత్యంత అనుకూలంగా ఉండటానికి కారణమిదే. స్కూబా ప్రేమికుల తాపం చల్లార్చేందుకు ఇక్కడ కోరల్ ద్వీపం కూడా ఉంది. ఈ సున్నపు రాతి ద్వీపాల్లో మరో విశేషమేమిటంటే రహస్యంగా ఉన్న సరస్సులు, గుహలు అనేకం ఉంటాయి. కొన్ని గుహలు మొత్తం ద్వీపం ఒక కొస నుంచి మరో కొసకు దారినిస్తాయి. నాటు పడవల్లో కూర్చుంటే తలకు తగిలేంత తక్కువ ఎత్తులో ఉంటాయి గుహలు. కొన్ని చోట్ల అంధకారం గుండె సడిని పెంచితే, మరికొన్ని చోట్ల పూర్తిగా పడవలో పవళించి గుహను దాటాల్సి ఉంటుంది. ఈ ప్రయాణమే మొత్తం ట్రిప్‌లో హైలెట్.

బాండ్.. జేమ్స్‌బాండ్..

ఇక్కడో ముఖ్యమైన గమ్యస్థానం ఉంది. ఫాంగ్ గ్నా, క్రాంబీ, పుకట్‌లలో ఎక్కడకు విడిది చేసినా జేమ్స్‌బాండ్ ఐల్యాండ్‌ను సందర్శించనిదే ఈ ట్రిప్ పూర్తి కాదు. బీచ్‌ల్లో కాలం మరిచి సేదతీరాక సముద్రంలో బోటింగ్‌కు తెడ్డు పడ్డాక అక్కడకు కచ్చితంగా చేరాల్సిందే. 1974లో విడుదలైన జేమ్స్‌బాండ్ సినిమా ‘ మేన్ విత్ ఎ గోల్డెన్ గన్’ సినిమాలోని పతాక సన్నివేశాల్ని ఇక్కడ చిత్రీకరించారు. ఈ దీవి అద్భుతాల్ని ఫ్రేమ్ కట్టిన ఆ సినిమా విడుదలయ్యాక ఇక్కడ పర్యాటకం ఒక్కసారిగా ఎగిసింది. 1998 వరకు జేమ్స్‌బాండ్ ఐల్యాండ్ సమీపం వరకు మర పడవలు వెళ్లేవి. కానీ, వాటి వల్ల ద్వీపానికి నష్టం వాటిల్లే అవకాశముండటంతో వాటిని నిషేధించారు. పర్యాటకులు సురాకుల్ అనే పొడవాటి తోక కలిగిన రంగుల పడవల ద్వారా దగ్గరకు చేరుకుని దీవి అందాల్ని సందర్శిస్తారు. కింది భాగం 4 మీటర్ల చుట్టుకొలతతో ఉండే దీవి పైకి వెళ్లే కొలది క్రమంగా 8 మీటర్లకు చేరుకుంటుంది. మొత్తం 20 మీటర్ల ఎత్తు ఉండే ఈ దీవి సముద్రానికి మేకు కొట్టినట్టు కనిపిస్తుంది. అసలు స్థానిక భాషలో దాని పేరు కూడా మేకు మీదే వచ్చింది. కో టాపుగా స్థానికులు పిలుచుకుంటారు కానీ, అంతర్జాతీయ మ్యాపులతో పర్యాటక సంస్థలలోను జేమ్స్‌బాండ్ ఐల్యాండ్‌గానే ప్రాచుర్యంలో ఉంది. కో టాపు అని పిలవబడటానికి ఆసక్తికర కథ ఒకటి స్థానికులు చెబుతుంటారు. ఫాంగ్ గ్నాలో నివసించే ఓ మత్స్యకారుడి ప్రతిరోజు వలలో ఇబ్బడిముబ్బడిగా చేపలు పడేవట. ప్రతి రోజు మంచి వేటతో సంతోషంగా ఇంటికి చేరేవాడు. కానీ ఒక రోజు ఎన్ని సార్లు ప్రయత్నించినా ఒక్క చేప కూడా వలలో పడలేదు. విసిగిపోయి ఉన్న ఆ జాలరికి ఓ మేకు వలలో చిక్కి కనబడింది. ఆవేశంగా దాన్ని రెండు ముక్కలుగా తన కత్తితో నరికి ఒకదాన్ని దూరంగా సముద్రంలో విసిరేశాడు. అదే కో టాపు. ఇది వినడానికి అతిశయోక్తిగా ఉన్నా పర్యాటకులు ఇలాంటి కథల్ని ఎంతో ఆసక్తిగా వింటూ పడవ ప్రయాణాన్ని ఆస్వాదిస్తారు. అయితే శాస్త్రవేత్తల లెక్కల ప్రకారం పెర్మియన్ కాలంలో బారియర్ రీఫ్‌లో భాగంగా ఉన్న ఈ దీవుల ప్రాంతం టెక్టానిక్ ప్లేట్‌ల కదలికలతో చీలిపోయి ఇలా విభిన్న భంగిమల్లోని దీవులుగా ఏర్పడి ఉంటాయని వివరణ. సముద్ర గాలులు, అలలు, ఆటుపోట్లు, నీటి ప్రవాహాల ఒరిపిడితో సున్నపు రాయి కరిగి ఇలా ఒంటి స్తంభం దీవిలా తయారైందని చెబుతారు.

కేవలం 40 మీటర్ల దూరంలో ఉన్న జంట కొండల ద్వీపం ఖావో ఫింగ్ ఖాన్ ఆకట్టుకునే బీచ్‌లను కలిగి ఉంటుంది. ఒక కొండ మరో కొండపై వాలిపోయినట్టు ఉండే ఈ దీవుల పేరుకు అర్థం కూడా అదే. ఇక్కడకు చేరాక మరో వింత అనుభూతి కలుగుతుంది. ఎదురుగ్గా ఉన్న కో టాపు సముద్రంలో ఒంటి స్తంభంలా కనిపిస్తుంది. ఆవో ఫాంగ్ గ్నా జాతీయ పార్క్ కిందకు వచ్చే ఈ దీవుల ప్రాంతంలో వేల ఏళ్ల నాటి కుడ్యచిత్రాలు కనిపిస్తాయి. వాలుగా ఉండే కొండ రాయి నున్నగా ఎవరో పలకను అమర్చినట్టు కనిపిస్తుంది. దీనికి అతికించిన టాబ్లెట్లు (ఫలకాలు) చాలా ఏళ్ల క్రితం నాటివి. బౌద్ధం, ఇస్లాం ఎక్కువగా కనిపించే స్థానిక మత విశ్వాసాలకు తగ్గట్టుగా ఆయా మతాలకు చెందిన భిక్షువులు, విశ్వాసకులు కూడా తారసపడుతుంటారు. కానీ, ఎక్కువగా ఉల్లాసం కోసమే వచ్చే విదేశీ పర్యాటకులే ఉంటారు. ఎటు చూసినా వాళ్లే కనిపించడంతో హవాయి ద్వీపాల్లోనో మరేదో పశ్చిమ ప్రపంచంలోనో ఉన్నామనే భ్రమ కలుగుతుంది. ఇంతలా విదేశీ సందర్శకులతో నిండిపోవడానికి కారణం జేమ్స్‌బాండ్ సినిమానే. గవ్వలు, కోరల్స్‌తో చేసిన స్థానిక ఉత్పత్తులను కొనేందుకు ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ కూడా ఉంటుంది. కేవలం కోరల్సే కాకుండా బటర్ ఫ్లై చేపలు, మంత్ర రేస్ వంటి అరుదైన 24 రకాల మత్స్య జాతులను, 26 రకాల సరీసృపాలను, 14 రకాల రొయ్య జాతులను, 15 రకాల పీత జాతులకు ఇది నెలవు. ఫాంగ్ గ్నా పట్టణానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ దీవులు 12 ద్వీపాల సముదాయం. వీటిలో మిగతా దీవులు కూడా సందర్శనీయాలే.

విందుకో దీవి

కో పాన్యీ – మత్స్యకారుల ఈ ద్వీపంలోనే విందు ఏర్పాట్లు ఉంటాయి. జేమ్స్‌బాండ్ ఐల్యాండ్‌కు వెళ్లే దారిలో ఉండే ఈ ద్వీపంలోనే పర్యాటకులకు భోజనం దొరుకుతుంది. స్థానికుల వంటకాలతో పాటు ఇప్పుడిప్పుడే మిగతా క్యూజిన్ కూడా అందుబాటులో ఉంటోంది. దీనికే కాక వారి గ్రామాన్ని సందర్శించేందుకు కూడా అవకాశం చిక్కుతుంది. మసీదు, ఖనన ప్రదేశం మినహా మిగతా గ్రామమంతా ఒడ్డు దగ్గరిలోని నీటిలో వేసిన పునాదుల మీదే ఉంటుంది. సుమారు 1500 మంది నివసించే ఈ గ్రామంలో పర్యాటకులను కలుపుకుంటే అంతమంది కేవలం నీటిపై కట్టిన నిర్మాణాలపైనే ఉంటారు. మరో ప్రత్యేకత ఏమిటంటే స్థానికులంతా తో బాబు అనే వ్యక్తి బంధుగణమే. 200 ఏళ్ల క్రితం ఇండోనేషియా నుంచి వలస వచ్చి ఈ దీవిని నివాసంగా మార్చుకున్న కుటుంబం అతనిదని స్థానికులు అంటారు. ఇక్కడ పర్యాటకులు విడిది చేసేందుకు ఇప్పుడిప్పుడే ఏర్పాట్లు చేస్తున్నారు.

-అజయ్ కుమార్ వారాల

మరిన్ని ఆకర్షణలు

- కో బాన్ – మిగతా ప్రపంచాన్ని కాసేపు మరచిపోయి హాయిగా సేద తీరాలంటే ఈ దీవికి రెక్కలు కట్టేయాలి. గొట్టం సాయంతో ఊపిరి తీసుకుంటూ సముద్ర గర్భంలో నడిచే స్నోర్కెల్లింగ్‌కు అత్యంత అనువైన ప్రదేశమిది. అదీ వద్దనుకుంటే స్వచ్ఛమైన ఈ బీచ్‌లో నడుస్తూ కాలం మరచిపోవచ్చు.
- కో హై – ఇది పగడాల దీవి. కోరల్స్ అందాలను తిలకించేందుకు స్కూబా డైవర్లు తోడు ఉంటారు.
- కో లాన్ – ఆ చిన్నపాటి దీవుల్లోను అచ్చెరువొందించే బంగళాల కట్టుబడిని చూడాలంటే ఈ దీవిలో విహరించాలి. స్థానికుల జీవనశైలి కూడా తెలుస్తుంది.
- ఇవే కాక కో యావో, కో మాఫ్రావో, కో రాచా, కో మైతో వంటి మిగతా ద్వీపాలు సందర్శనీయాలే. ✦

'తుమ్మెదా ఒకసారి మోమెత్తి చూడమని చెప్పవే.. నా మాట రాచిలుక తోడ రమ్మనవె తుమ్మెద..' ఎస్. రాజేశ్వరరావు, బాల సరస్వతి పాడిన లలిత గీతం ఆంధ్ర దేశంలో సంగీతాభిమానులందర్నీ ఉర్రూతలూగించింది. గోపాల కృష్ణయ్య నల్లన.. గోకులంలో పాలు తెల్లన.. బాల సరస్వతి లలిత గీతం ఎంత రసరంజకంగా ప్రేక్షకుల్లో చోటు చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మత్తైన గొంతు... గమ్మత్తైన గొంతు ఆమె పాడిన ప్రతి పాటా పూర్ణాయుష్షుని సంతరించుకున్నాయి. స్వర సరస్వతి ఆమె గొంతులో కొలువు తీరింది. ఇప్పటికీ ఆమె వేదికల మీద పాడగలగడం మనం చేసుకున్న అదృష్టం.

తెలుగులో తొలి నేపథ్య గాయని

బాల సరస్వతి చిన్న వయస్సులోనే ఆలిండియా రేడియోలో పాడిన ప్రతిభావంతురాలు. హెచ్.ఎమ్.వి. గ్రామఫోన్ రికార్డు ఇవ్వడం నిజంగా ఒక రికార్డ్. వెంకటగిరిలో 1928లో జన్మించిన ఈమె ఆళ్ళతూరు సుబ్బయ్య వద్ద సంగీతం నేర్చుకుంది. దర్శక బ్రహ్మ సి.పుల్లయ్య దర్శకత్వం వహించిన 'భక్త ధ్రువ'లో నటించడమే గాకుండా ఒక పాట కూడా పాడింది. తొలిరోజుల్లో కె.సుబ్రమణ్యం ఆహ్వానం మేరకు భక్త కుచేల, బాలయోగిని, భక్త తుకారాం చిత్రాల్లో (తమిళం) నటించింది. తుకారాం తెలుగులో సి.ఎస్.ఆర్.ఆంజనేయులు కూతురిగా నటించింది. రేణుకా ఫిలింస్ చిత్తూరు వి.నాగయ్య ఆహ్వానం మేరకు 'భాగ్యలక్ష్మి' చిత్రంలో నాగయ్య సరసన నటించిన తొలి కథానాయిక కమల కోట్నీస్‌కి నేపథ్యగానం చేసి 'తిన్నె మీద సిన్నోడ..'తో రికార్డు సృష్టించింది. ఈ చిత్రానికి స్వరకర్త భీమవరపు నరసింహారావు. ఈ సినిమా తర్వాత ఆమె తెర మీద నటించలేదు. కథానాయికగా ఎన్నో అవకాశాలువచ్చినా సున్నితంగా తిరస్కరించింది. ఆమె స్వర ప్రస్థానాన్ని సీరియస్‌గా మొదలు పెట్టింది. తెలుగు, తమిళ భాషల్లో నేపథ్యగాయనిగా తొలి ప్రయత్నంలోనే కీర్తి ప్రతిష్ఠల్ని సంపాదించింది.

అనితర సాధ్యమైన గాత్రం

ఆమె గొంతులో పలికే విషాదం మరొకరి గొంతులో పలకదు. ఆమె గొంతు పలికించిన శృంగారం మరే గొంతులో కనిపించదు. లలిత సంగీతంలో సోలోగాను, ఎస్. రాజేశ్వరరావుతో కలిసి యుగళ గీతాలు పాడి జనాల్ని రంజింపచేసింది. ఆమె గొంతుకి ముగ్ధులై జి.రామనాథన్, కె.వి. మహదేవన్, సి.ఆర్. సుబ్బు రామన్, యస్.వి. వెంకట్రామన్, విశ్వనాథం, రామమూర్తి, భీమవరపు నరసింహారావు, ఎస్. రాజేశ్వరరావు, పి. ఆదినారాయణ రావు, బాలాంత్రపు రజనీకాంతరావు, అద్దేపల్లి రామారావు, చిత్తూరు వి.నాగయ్య, టి.వి. రాజు, ఘంటసాల, నౌషద్, సుసర్ల దక్షిణామూర్తి, వీణ రంగారావు, మాస్టర్ వేణు, ఆర్. సుదర్శనం, పామూరు కృష్ణమూర్తి, జి. గోవిందరాజుల నాయుడు, ఎమ్.బి.శ్రీనివాస్ సంగీత సారథ్యంలో తన గానామృతాన్ని చిలకరించింది. తెలుగు, తమిళ చిత్రాలను చూసిన సంగీత రసజ్ఞులు ఆమె పాటకి పెద్ద పీట వేశారు. తొలి రోజుల్లో యస్.రాజేశ్వర రావు స్వర రచనకి ఆరో ప్రాణంగా నిలిచి ఆ పాటలకు నిత్య శోభను చేకూర్చింది. తర్వాత ఘంటసాల, ఎ.ఎస్.రాజా, టి.ఎమ్. సుందర్ రాజన్, ఎమ్.ఎస్.

రామారావు, పిఠాపురం నాగేశ్వరరావు సహ గాయనీమణులైన ఎ.పి.కోమల, కె.రాణి, 'ఎమ్.ఎస్ రాజేశ్వరి', జిక్కి, పి.ఎస్. వైదేహి వంటి వారి ఈ స్వర్ణయుగపు సౌరభాల్ని ఇప్పటికీ మనం ఆస్వాదిస్తూ ఉన్నాం.

రామానాయుడు, కె.విశ్వనాథ్, అశ్వనీదత్‌తో....

వెలకట్టలేని గీతాలు

ఎస్.హనుమంతరావు స్వర రచనలో 'రాధిక' చిత్రంలో గోపాల కృష్ణుడు నల్లన.. గోకులంలో పాలు తెల్లన.., 'షావుకారు' చిత్రంలో ఘంటసాల స్వర రచన దీపావళి.. దీపావళి.., జి.అశ్వత్థామ స్వర రచన 'చిన్న కోడలు' చిత్రంలోని జో..జో..జో వయ్యారి.. రా.రా.. దొరా, 'మానవతి' చిత్రం కోసం బాలాంత్రపు స్వరసారథ్యంలో ఓ మలయ మారుతమై.. ఓ మలయ పవనమై.. పాటల్ని మర్చిపోలేం. దేవదాసు చిత్రం గురించి ప్రత్యేకించి చెప్పాలి. 'అందం చూడవయ.. ఆనందించవయా.. తానే మారెనా.. గుణము మారెనా.. ఇంత తెలిసియుండి ఈ గుణమేలరా?' నా ఇల్లు చిత్రం కోసం 'అదిగదిగో గగన సీమ..', (చిత్తూరు వి.నాగయ్య, సంగీత దర్శకులు అద్దేపల్లి) 'జయసింహ' చిత్రం కోసం 'మదిలో మధుర భావన పలికేను..', 'పెళ్ళి సందడి' చిత్రం కోసం 'రావె ప్రేమలతా.. ఓహో కవిరాజా (ఘంటసాలతో), 'మా ఇంటి మహాలక్ష్మి' చిత్రంలోని 'చివురుల్లో చిలకలాగ.. ఈ పాటలన్నీ మేలి రత్నాలు. ప్రముఖ సంగీత స్వర కర్తలందరూ బాల సరస్వతి స్వరమాధుర్యాన్ని చవి చూశారు. తెలుగు తమిళ సంగీత రసజ్ఞులు ఆమె గొంతుని మరిచిపోలేరు.

వివాహంతో మార్పు

యుక్తవయసు రాకముందే పిఠాపురం రాజావారితో పెళ్ళి జరగడం ఊహించని పరిణామం. మంచి అందగత్తె. అంతకు మించి ఎదుటి వారిని సమ్మోహితుల్ని చేసే గానం. ఈ గానం తనకే సొంతం కావాలనుకున్నాడు ఆమె భర్త. బంగారు పంజరంలో చిలకలా బంధించాడు. ఆ గానకోకిల గొంతు మూగపోయింది. నౌకర్లు, చాకర్లూ ఎటు చూసిన తరగదనుకున్న సంపద. ఆమెకు భర్తే ప్రపంచమై పోయింది. కూని రాగాలు తీసేందుకైనా స్వేచ్ఛలేని జీవితం. ఆమె పయనమేమిటో గమ్యం ఏదో తెలియని అయోమయ జీవితం. భర్త చనిపోయిన తర్వాత ఒకేసారి అంధకారమైపోయింది. మైసూర్ మహరాణిలా బతికిన ఆమెకు నిజం కనువిప్పు కలిగించింది. ఆస్తులు కరిగిపోయాయి. అప్పులు పెరిగిపోయాయి. ఆదుకునేవారే కరువైపోయారు. పరిశ్రమ అప్పటికే చెన్నై నుండి భాగ్యనగరానికి తరలిపోయింది. తన సహచరులందరూ హాయిగా సెటిలైపోయి విశ్రాంతి తీసుకుంటున్నారు. చెన్న పట్నం బాలసరస్వతిని వెక్కిరించింది. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత కొంత మేరకు సహాయం చేసినా అది తక్కువే. విష వలయంలో చిక్కుకున్న ఆమెకు శాశ్వత పరిష్కారం దొరకలేదు. దొరుకుతుందన్న ఆశా లేదు.

భాగ్యనగరంలోనే మకాం

తిండి, బట్ట, నీడ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకుంది. ప్రభుత్వాలు మారినా ఫలితం దక్కలేదు. మొక్కవోని ధైర్యంతో ఆమె ముందుకు సాగుతోంది. సాంస్కృతిక సంస్థలు ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా వర్ధమాన గాయనుల్లా ఉత్సాహంగా పాల్గొంటుంది. ఔత్సాహిక గాయనీమణుల్ని ప్రోత్సహిస్తోంది. ఆత్మీయంగా తన దగ్గరికి వచ్చేవారిని స్వతంత్ర భావాలతో వ్యవహరించమని సలహా యిస్తుంది. కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కవి కల్పన కంటే చిత్ర విచిత్రమైంది. అది ఆమె స్వానుభవం.

పి.సుశీలతో...

ఈ ప్రభుత్వమైనా స్పందిస్తుందా!

గుళ్ళు, గోపురాలకు, పండుగలు, ఆటపాటలకు కోట్ల ఇనాంలిస్తూ సముచితరీతిలో ప్రోత్సహిస్తున్న ఈ ప్రభుత్వమైనా ఆమెను ప్రోత్సహించాలి. ఒక సంగీత సరస్వతికి కుల, మత, ప్రాంతీయతలతో సంబంధం లేదు. దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షులా కాకుండా ఆపన్న హస్తం అందిస్తే ఆ స్వర జీవనం హాయిగా సాగిపోతుంది. తన ప్రతిభకు ప్రభుత్వం వారందించిన నిజమైన నీరాజనంగా నిలిచిపోతుంది.

జానకి,పి.బి.శ్రీనివాస్‌తో...

ఇమంది రామారావు

9010133844

వింత లోకం

సొంత విమానం

ఆస్మెలాష్ జెరెపు అనే వ్యక్తి నిన్నటి దాకా అతి సామాన్యుడు ఇవాళ అతనికి సొంత విమానం ఉందండోయ్. దాన్ని సొంతగా తయారు చేసుకున్నాడు మరి. ఇథియోపియాలో మొత్తం విమానాన్ని తయారుచేసిన తొలి వ్యక్తిగా పేరు తెచ్చుకోవాలనేది అతడి లక్ష్యం. పదిహేనేళ్ల క్రితం ఆ దేశ ఏవియేషన్ కోర్సులో చేరేందుకు ప్రయత్నిస్తే ఒక్క సెం.మీ. తక్కువ ఎత్తు ఉన్నాడని ఒప్పుకోలేదు. తానే సొంతగా విమానాన్ని రూపొందిస్తానని సవాలు విసిరాడు. వందలాది యూట్యూబ్ వీడియోల్ని, వేల పేజీల సమాచారాన్ని సేకరించి సొంతగా తర్ఫీదు పొందా డు. పాత, కొత్త సామాను, కారు ఇంజిన్, బైక్ పరికరాలను పోగేసి విమానానికి ఎట్టకేలకు ఓ రూపం తెచ్చాడు. తన తల్లి పేరు, తయారీకి పట్టిన రోజుల్ని కలిసేలా కె-570ఎ అని పేరు పెట్టాడు. విమానం ఎగిరేందు కు తొలి ప్రయత్నం లో కాస్త ఇబ్బందులు ఎదురైనా పర్వాలేదనిపించింది.

బంగాళదుంప సందేశం

బంగాళా దుంపలతో సందేశమా - దీని దుంపతెగ! అదెలా? అని ఆశ్చర్యపోకండి. టెక్సాస్‌కు చెందిన అలెక్స్ క్రెగ్ ఓసారి తన ప్రియురాలితో కలిసి డిన్నర్ చేస్తున్నపుడు ఈ ఆలోచన వచ్చిందట. ఆమెకి చెప్పగానే "ఇంత చెత్త ఆలోచన నేనెక్కడా చూడలేదు. నువ్వు ఒక్క బంగాళదుంప కూడా అమ్మలేవు" అని ఆమె అతడిని నిరాశపరిచినా మన వాడు వెనుకంజ వేయలేదు. అతడు చేసిందల్లా దుంపల మీద మెసేజ్‌లు రాసి పంపడం. "నాన్నా.. నువ్వంటే నాకిష్టం" అని ఒక కొడుకు తండ్రికి బంగాళాదుంప మీద మేసేజ్ పంపుతాడు. అలాగే ప్రేమ సందేశాలు, శుభాకాంక్షలు. ఇటువంటి గ్రీటింగ్స్ అన్నీ కస్టమర్స్ ఆన్‌లైన్‌లోనే ఆర్డర్ చేస్తారు. క్రెగ్ అందమైన అక్షరాలతో సందేశాలను బంగాళాదుంపల మీద రాసి చేరవలసిన చోటుకి పంపిస్తాడు. ఇలా బంగాళ దుంపలతో సందేశాలు పంపే వ్యాపారం మొదలుపెట్టి నెలకు సుమారు ఆరు లక్షల రూపాయలకు పైనే సంపాదిస్తున్నాడు. మనుషులు జీవితంలో వెనకడుగు వేయడానికి రెండే కారణాలు. ఓడిపోతామేమో అనే భయం ఒకటి, నువ్వు అసలు సాధించగలవా అనే అనుమానం రెండోది. ఈ రెంటినీ ఆధిగమించగలిగితే మనం దేన్నైనా సాధించగలం అంటాడు అలెక్స్.

రోబో రెస్టారెంట్

కాలిఫోర్నియాలోని ఓ రెస్టారెంట్‌లో క్యాషియర్లు, సర్వర్లు అసలు స్టాఫ్ ఎవరూ కనిపించరు. కేవలం కొన్ని ఐ-ప్యాడ్‌లు, టచ్ స్క్రీన్ ఉన్న ఫుడ్ కంపార్ట్‌మెంట్‌లు తప్ప. క్యాష్ కార్డు స్వైప్ చేసి మనకిష్టమైన ఆహారాన్ని ఎంపిక చేసుకుంటే చాలు. కాసేపటికి మన పేరుతో ఉన్న ఆహారం వేడివేడిగా ఫుడ్ కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చేస్తుంది. రెండు సార్లు టచ్ స్క్రీన్‌ను ట్యాప్ చేసి దానిలోని ఆహారాన్ని తీసుకుని ఆరగించేయొచ్చు. ఆ తర్వాత ప్లేట్లను ఆటోమేటిక్‌గా సేకరించే ట్రేలో వేస్తే చాలు. మనకు కనిపించకున్నా వెనుక ఉండి వంట చేసేది మాత్రం మనుషులేనండోయ్.

మిమిక్రీతో బతికేస్తోంది

బ్రౌన్ తోర్న్‌బిల్ అనే ఈ బుల్లి పిట్టకు బోలెడు శత్రువులు. ముఖ్యంగా తమకంటే 40 రెట్ల పరిమాణంలో ఉండే కార్రోవాంగ్స్ అనే భారీ పక్షులైతే మరీను. గూళ్లను కూడా ధ్వంసం చేసేసి ఈ పిట్టలకు ప్రాణ సంకటంగా మారతాయవి. వీటిని ఎదుర్కోవడానికి ఈ బుజ్జి పిట్టలు ఓ చక్కని టెక్నిక్‌ను ఫాలో అవుతున్నాయి. ఏ పక్షికైనా చుక్కలు చూయించేవి గద్దలని గమనించి అవి వచ్చేటప్పుడు మిగతా పక్షులు ఎలా గోల చేస్తాయో సరిగ్గా అలానే మిమిక్రీ చేసేసి కార్రోవాంగ్స్‌ను బెదరగొడతాయి. కాకులు, గుడ్లగూబలు ఇలా చాలా రకాల పక్షుల డేంజర్ సిగ్నల్స్‌ను మిమిక్రీ చేసి శత్రువుల్లో అయోమయాన్ని కలిగిస్తాయని ఆస్ట్రేలియా పక్షి శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది.

కాలి నడకన ప్రపంచాన్ని చుట్టి..

జీన్ బెలివియా అడుగు తడబడింది. అతడు ఒకేసారి రెండు వంతెనల్ని దాటుతున్నాడు. ఒకటి మాంట్రియల్‌లోని జాక్వెస్ కార్టియర్ బ్రిడ్జిని, రెండోది యాభైవ పడిలో పడేసిన మిడ్‌లైఫ్ క్రైసిస్‌ను. ఈ రెండు వంతెనల్ని దాటుతూ ఓ గొప్ప పయనానికి ఆలోచన చేశాడు. 11 ఏళ్లపాటు 64 దేశాల మీదుగా 11,500 కిలోమీటర్ల పొడవునా కాలి నడకన ప్రపంచ పర్యటన ముగించి ఆలోచన దాటేశాడు. అప్పుడు తడబడిన ఆ అడుగు పరిపూర్ణమైన నడతలో పడేసింది.

ముచ్చటైన కుటుంబం.. భార్య లూస్, బిడ్డలు థామస్ ఎరిక్, ఎలీసా జేన్. చక్కటి వ్యాపారం.. నియాన్ సైన్ ఫ్యాక్టరీ. నాలుగు పదుల దాటిన జీవితంలో జీన్ బెలివియా ఎన్నో నియాన్ వెలుగుల్ని చూశాడు, అనుబంధాల ఊటను మది నింపుకున్నాడు. ఇంకా ఏం కావాలి. కులాసాగా, సాఫీగా సాగిపోతున్న జీవితం. ఈ ఆలోచనలతోనే జాక్వెస్ కార్టియర్ బ్రిడ్జిపై మార్నింగ్ వాక్‌లు సాగేవి జీన్‌కు. సరాసరిన అక్కడి నుంచి న్యూయార్క్ కాలినడకన చేరిపోతే ఎలా ఉంటుందోనని ఊహించుకున్నాడు ఓరోజు. భార్యకు ఈ విషయం ఎలా చెప్పాలో తెలియక మథనపడ్డా... ధైర్యం చేసి బయటపెట్టేశాడు. తొలుత భయపడిన లూసే భర్త ప్రయాణానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. సుమారు రెండు లక్షల రూపాయల్ని పోగేసి ఖర్చులకు అందించింది. కాలినడకన బరువుల భారం పడకుండా ఓ ట్రాలీని కొనిచ్చింది. తొమ్మిది నెలల పాటు ప్రయాణ కసరత్తులు చేసుకున్న జీన్ 2000 ఆగస్ట్ 18న కుటుంబ సభ్యుల ఆత్మీయ వీడ్కోలుతో నడక మొదలు పెట్టి అదే రోజున కెనడాలోని మాంట్రియల్ దాటేశాడు. కొన్ని రోజుల్లోనే కెనడా అమెరికా సరిహద్దు ఊళ్ల గుండా అమెరికాలో ప్రవేశించాడు. కెనడా మాతృదేశమే అయినా తాను ఇంతకు ముందెన్నడూ చూడని వైవిధ్యం కాలి నడకన ఎదురైంది. ఫొటోలు తీసి భార్యకు పంపించేవాడు. జీన్ మహత్తర పయనానికి స్ఫూర్తి నింపేందుకు లూస్ 'వరల్డ్ వైడ్ వాక్' అన్న వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. ప్రపంచానికి శాంతిని మోసుకెళుతూ, ప్రపంచంలోని చిన్నారులందరికీ అంకితమిస్తూ వెబ్ సైట్ నామకరణం చేశారు. భర్త పంపిన ఫొటోలను ఎప్పటికప్పుడు దాంట్లో ఉంచి జీన్ ఏ ఊరు దాటాడు, ఎక్కడ తలదాచుకున్నాడు, ఎంత దూరం నడిచాడనే విషయాలతో అప్‌డేట్ చేసేది.

ప్రతి అనుభవాన్ని రికార్డ్ చేస్తూ..

అమెరికా మీదుగా బ్రెజిల్ చేరుకుని అక్కడి నుంచి దక్షిణ అమెరికా దేశాలను చుట్టిన జీన్ విమానం ద్వారా ఆఫ్రికా ఖండంలో అడుగుపెట్టాడు. ట్రాలీలో క్యాంపింగ్ సామాను, కెమెరా, నీరు, ఆహారంతో పాటు ఓ లాగ్ బుక్‌ను, డైరీని వెంట తీసుకెళ్లాడు. అమెరికా, దక్షిణాఫ్రికాల్లో జైలులోను తలదాచుకున్నాడు. ఇథియోపియాలో అల్లరి మూకతో ఇబ్బందులు పడ్డాడు. జీన్ సంకల్పం గురించి తెలిసి ఊళ్లు ఊళ్లంతా పలికిన సాదర ఆహ్వానాలు అందుకున్నాడు. ఎడారుల్లో దారి తప్పి రోజులకు రోజులు ఒంటరితనంతో బిక్క చచ్చి మనిషి జాడ కోసం పరితపించిపోయాడు. మరో అడుగు వేయలేనని నడక ఆపే ప్రయత్నం చేసినపుడల్లా భార్య వెన్ను తట్టి నడిపించిన సందర్భాలను మరిచి పోలేదు. ఈజిప్ట్, మొరాకోల మీదుగా యూరప్‌లో ప్రవేశించి అక్కడి నుంచి మళ్లీ ఆసియా బాట పట్టి ఇరాన్ నుంచి భారత్‌లోకి విమానం ద్వారా చేరుకున్నాడు. అప్పటికి ఎనిమిదేళ్లు గడిచిపోయాయి. ఒక్కో ఏడాది ఎన్ని దేశాల్లో తిరిగాడు, ఎంత దూరం నడిచాడనే టైంటేబుల్‌ను వెబ్‌సైట్‌లో ఉంచాడు. భారత్‌ను పశ్చిమం నుంచి తూర్పుకు నడిచిన జీన్ చైనాలో ప్రవేశించాడు. అటుగా జపాన్, బోర్నియో, ఇండోనేషియాలు చేరి ఆసియాలో నడకను పూర్తి చేశాడు. ఇంత దూరం నడిచిన జీన్‌కు తానెపుడూ తోడుగా ఉన్నాననే భావన కలిగేలా భార్య మధ్య మధ్యలో కలుస్తుండేది. అలా 11 సార్లు వివిధ దేశాల్లో జీన్‌ను కలుసుకుని కొన్ని రోజులు వెంట నడిచింది. పిల్లలు కూడా జీన్‌ను చేరి ఉత్సాహపరిచేవారు. తన యాత్ర ముగిసేలోగా జీన్ తాత కూడా అయిపోయాడు. ఐదేళ్లు వచ్చిన తన మనవడిని జర్మనీలో చూసుకుని మురిసిపోయాడు. కొన్ని రోజుల పాటు మనవడితో ఆటపాటలు అయ్యాక మళ్లీ నడక ప్రారంభించాడు. ఇలా ఎన్నేళ్లయినా, ఎంత దూరాలు దాటినా, ఎంత మార్పులు చోటుచేసుకున్నా కుటుంబం జీన్‌ను వదల్లేదు. జీన్ మనసు కుటుంబాన్ని విడవలేదు. 2008లో తైవాన్‌లో భార్యను కలిసి చేసుకున్న క్రిస్మస్ వేడుక జీవితంలో గొప్ప పండగని చెప్పే జీన్ ఆమే లేకుంటే తన యాత్ర సాధ్యమయ్యేది కాదని అంటాడు. ఆసియా ఖండంలోని వైవిధ్యాన్ని దర్శించిన జీన్ ఆస్ట్రేలియా యాత్రలోకి ప్రవేశించాడు. ఆ ఎడారి ఖండంలోని ఔట్ బ్యాక్ విపరీత పరిస్థితులు ఎంత అధైర్యపరిచినా తన నడకను మాత్రం ఆపలేదు. రోజుకు 20 మైళ్లు ఎడారిలో నడిచేసరికి చాలా శక్తి కోల్పోయేవాడు. అక్కడి యాత్రలో తాగు నీరు అందించిన వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పే జీన్ ఆస్ట్రేలియా పర్యటన ముగిశాక మళ్లీ కెనడాలో ప్రవేశించి కాలినడకన మాంట్రియల్ చేరుకుని తన ప్రపంచ యాత్ర 2011లో ముగించాడు.

జగమంత కుటుంబం

గుళ్లు, చర్చిలు, పార్కులు ఇలా ఎక్కడ సురక్షితంగా అనిపిస్తే అక్కడే తల దాచుకున్న జీన్‌కు 1600 కుటుంబాలు ఆత్మీయంగా ఆతిథ్యం ఇచ్చాయి. తమ సొంత కుటుంబ సభ్యుడిలా ప్రేమను పంచి ఆయన పర్యటనకు అర్థాన్నిచ్చాయి. వారితో పంచుకున్న అనేక అనుభూతులు, ఆయా కుటుంబాల ద్వారా తెలుసుకున్న సంగతులతో ఓ పుస్తకాన్ని ఫ్రెంచిలో రాశాడు. వీసా సమస్య వల్ల లిబియా, ప్రమాదకరం కావడం వల్ల కొలంబియాల్లో నడవలేకపోయానని చెప్పే జీన్ ఆరు ఎడారులను దాటాడు. ఈజిప్ట్‌లోని స్ఫింక్స్‌ను చూసి ప్రేరణ పొందాడు. నలుగురు నోబెల్ బహుమతి గ్రహీతల్ని కలుసుకోగలిగాడు. డర్బన్‌లో నెల్సన్ మండేలాను కలిసి స్ఫూర్తి పొందాడు. ఆస్ట్రేలియాలో ఉన్నపుడు కొందరు వైద్యులు ఇంతకు ముందులా నీ వ్యక్తిగత జీవితం ఉండదనే మాట ఆలోచనలో పడేసింది. భార్యతో విడాకులు తీసుకుని జగమంత కుటుంబానికి అంకితమవుతూ మరో మలుపు తీసుకున్నాడు. పేరుకే విడాకులు అన్నా వారి మధ్య ఉన్న చక్కటి స్నేహ బంధాన్ని ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. 54 జతల షూలను మార్చిన జీన్ నడక గురించి తెలిసినవారంతా నివ్వెరపోయారు.

◆ కథ

అమ్మంటే నాకిష్టం

- కె. ఉషా రాణి

నాకు కళ్ళు మూతపడుతున్నాయి. బాగా నిద్ర వస్తున్నది. కానీ టప్ టప్ మని ఈ శబ్దం ఏంటో! వాన పడి ఆగిన తరువాత ఆకు నుండి చినుకు రాలి రేకుమీద పడిన శబ్దం. ఈ శబ్దం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే నా చిన్నప్పుడు ఒక రోజు... నాన్న బాగా తాగి వచ్చి అమ్మను కొడితే ఆ విసురుకి అమ్మ వెళ్ళి గదిలో నేను చదువుకునే బల్ల మీద పడింది. అమ్మ తలకు బలంగా దెబ్బ తగిలి బోలెడంత రక్తం వచ్చింది. ఆ తరువాత అమ్మ బల్ల పక్క నుంచి జారి నేల మీద పడింది. అమ్మ రక్తం బల్ల పైనుండి నేల మీద ఇదిగో ఇలాంటి టప్ టప్ శబ్దంతో పడింది. అందుకే నాకీ శబ్దం అస్సలు ఇష్టం లేదు. పైగా అప్పుడు నిద్రపోయిన అమ్మ మళ్ళీ లేవలేదు. మళ్ళీ నేను అమ్మను చూడనే లేదు. నాకు ఆ రోజు ఇంకా జ్ఞాపకమే. దెబ్బ తగిలిన అమ్మను పక్కకు పడుకో బెట్టి నాన్న రక్తం అంతా తుడుస్తుంటే నాన్న సాయం చేయమని అడగకపోయినా నేనే నాన్నకి సాయం చేశాను. ఎప్పుడూ ఏ పనీ చేయని నాన్న ఆ రోజు ఇల్లంతా కడిగాడు. చిన్న పిల్లలకు ఎప్పుడు సహాయం చేయాలో బాగానే తెలుస్తుంది. మర్నాడు పొద్దున్నే నన్ను రవి వాళ్ళ ఇంటికి పంపించాడు. అప్పటి నుంచి ఎవరు ఎప్పుడు వచ్చి అడిగినా నాన్న అమ్మను కొట్టిన విషయం నేను ఎవరితోనూ చెప్పలేదు. నిజానికి నాన్న నన్ను చెప్పొద్దని చెప్పలేదు. నాకే తెలిసి పోయింది. ఇక ఆ తరువాత వేరే ఇంట్లో నేను, నాన్నే ఉంటున్నాం. నాన్నే నాకు అన్నీ చేసి పెడుతున్నాడు. అన్నీ అంటే అన్నం పెట్టడం స్కూల్‌కి తీసుకు వెళ్ళడం. జ్వరం వస్తే డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళడం అన్నమాట. కానీ నాన్నకి అమ్మలాగా జిలేబి, పాయసం చేయడం రాదు. అమ్మ లాగా కథలు చెప్పడం రాదు. పాటలు పాడడు. జో కొట్టడు. ఓహో మీకు అసలింతకీ నేనెవరో చెప్పడమే మర్చి పోయాను కదా! నా పేరు విజయ్. నాకిప్పుడు తొమ్మిదేళ్ళు. నేను మా ఊరి బ్లూమ్ అండ్ బ్లూమ్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాను. మాది బి సెక్షన్. నేను మీకు చెప్పిన సంగతి జరిగింది నా చిన్నతనంలో నేను అప్పుడు ఒకటో క్లాస్ చదువుతుండే వాడిని.

నేను మా పక్కింటి రవి ఒకటే స్కూల్ ఒకటే క్లాస్, ఒకే సెక్షన్ కూడా. నాన్నే ఇద్దరినీ స్కూల్‌లో వదిలిపెడతాడు. వచ్చేటప్పుడు రవి వాళ్ళ అమ్మ తీసుకువస్తారు. ఆమే సాయంత్రం తినడానికి పెడతారు. నేను రవి ఆడుకుంటుండగా నాన్న వచ్చి నన్ను ఇంటికి తీసుకుని వస్తారు. రవి వాళ్ళ నాన్న కార్లు నడుపుతారు. అప్పుడప్పుడు చాలా రోజులు ఊరు వెళతారు. అల వెళ్ళినప్పుడే నాతో పాటు మా నాన్న కూడా రవి వాళ్ళింటికి వచ్చేవాడు. ఇక ఆ రోజు నేను, రవి సినిమా కెళ్ళడం గ్యారెంటీ. మానాన్న సినిమా టికెట్‌కి డబ్బులు ఇచ్చేవాడు. నేను రవి, కమల్, వినీత, రాజు, రోజా మా ఇంటి దగ్గరి పార్క్‌లో ఆడుకుంటాం. కొన్ని రోజుల క్రితం రాజుకి ఏమయిందో తెలియదు గాని మాతో సరిగా ఆడలేకపోయాడు. రాజంటే మాకందరికీ చాలా ఇష్టం. మేము వేసిన బంతిని పరిగెత్తుకెళ్ళి నోటితో కరుచుకుని తీసుకుని వస్తాడు. అదిగో అలా మాతో ఆడే రాజు ఓ రోజు ఉన్నట్టుండి ముడుచుకుని పడుకున్నాడు. ఆ రోజు ఎందుకు లేవలేదో. మాకు తెలియదు. మర్నాటి నుంచి రాజు మాతో ఆడుకోవడానికి రాలేదు. రాజుని మేము ఆడుకునే స్థలంలో పూడ్చేసారని రవి మర్నాడు నాతో చెప్పాడు. నిజానికి పెద్దవాళ్ళకు చాలా విషయాలు తెలియవు. పైగా మాకు తెలియవనుకుంటారు. మీకో రహస్యం చెప్పనా! నేను మొక్క పాతుదామని మా ఆటలాడే స్థలంలో తవ్వితే ఓ దవడ ఎముక కనిపించింది. రేణు ఆంటికి... ఆదే... రవి గాడి అమ్మగారి పేరు రేణు. చూపిస్తే అది రాజు దవడ ఎముకే. 'బయట పారెయ్ ఇంట్లో పెట్టుకో కూడదు' అన్నారు. రాజు అంటే మాకు ఎంతో ఇష్టం కదా! రాజు దవడ ఎముక ఎందుకు ఇంట్లో పెట్టుకోకూడదు? అందుకే నేనే రహస్యంగా నా పరుపు కింద దాచుకున్నాను. అక్కడ నేను ఇంకా చాలా వస్తువులే దాచుకున్నాను. అందులో ముఖ్యమైనది అమ్మ పడినప్పుడు నా బల్ల నుండి ఊడి పడ్డ చిన్న చెక్క ముక్క. దానికింకా ఎండిన రక్తం మరక కొంచెం అలాగే ఉంది. నేను దాన్ని దాచుకున్నట్లు నాన్నకి తెలియదు. నాన్న ఇల్లు కడుగుతుండగా నేను దానిని పక్కన కిటికీలో పెట్టాను. ఆ తర్వాత నా రహస్య ప్రదేశానికి మార్చాను. మా నాన్న అది గమనించనే లేదు. మా సోము గాడు ఇచ్చిన సముద్రం రాయి. నీతా అక్క కట్టిన రాఖీ, నీల వేణి అంటీ ఇంట్లో ఆడుకుంటూ ఉండగా దొరికిన వైరు అలాంటివి చాలా ఉన్నాయి. ఆ స్థలం మానాన్న కంటపడదు. ఎందుకంటే మంచానికి పరుపుకి మధ్య మా నాన్న ఎప్పుడూ చెయ్యి పెట్టడు.

నాకు దసరా సెలవుల్లో జ్వరం వస్తే నాన్న డాక్టర్ అంకుల్ దగ్గరికి తీసుకుని వెళ్ళాడు. అంకుల్ మందులు ఇచ్చారు. నేను కూడా అంకుల్ చెప్పినట్టే వేసుకుంటున్నాను. మరి పెద్దవాడిని అయ్యాను కదా! నాకేమో అమ్మపాట వినకుండా... అమ్మ దగ్గర పడుకోకుండా... నిద్దర రావడం లేదు. అమ్మ ఎక్కడికి వెళ్ళిందో ఎవరూ సరిగ్గా చెప్పలేదు. నాన్న అమ్మని ఎక్కడికి పంపించాడో తెలియడం లేదు. కొన్ని రోజుల క్రితం రవితో వాళ్ళ అమ్మ , మా అమ్మ నక్షత్రం అయిందని చెప్పారట. వాడే ఆ విషయం నాతో చెప్పాడు. ఇది నేను నమ్మలేదు. మా సైన్స్ టీచర్ నక్షత్రాలు ఎప్పటి నుంచో ఉన్నాయని చెప్పారు. ఇంకా సూర్యుడు కూడా ఒక నక్షత్రమని చెప్పారు. ఆమెకి కొంచెం కోపమెక్కువే. హోం వర్క్ చేయనందుకు నన్ను ఒకటి రెండు సార్లు వాయించింది కూడా. అయినా పాఠం మాత్రం బాగా చెప్తుంది. అందుకని నేను ఆమె చెప్పినదే

నిజమనుకుంటున్నాను. నాన్న పక్కనే ఉన్నా... అన్నం వండి పెట్టినా... 'అమ్మ ఉంటే బాగుండు' అనిపిస్తుంది. మొన్న ఒక రోజు నాన్న నేను లూడో ఆడుతుంటే పక్కన కుర్చీలో కూచుని నా వంకే అదేపనిగా చూస్తున్నాడు. నాన్న కంట్లో నీళ్ళు కూడా నేను చూసాను. నాన్నని నేనెప్పుడూ ఇలా చూడలేదు. అయినా నేను చూడనట్టే ఊరుకున్నాను. పిల్లలు ఏడుస్తారు మరి. పెద్ద వాళ్ళు కూడా ఏడుస్తారా! ఏమో!! నాకు తెలియదు. నాన్న నేను సరిగా నిద్రపోవడం లేదని డాక్టర్ అంకుల్‌తో చెప్పడం విన్నాను. మరి మందులు వేసుకున్నా నేను కొన్ని రోజులుగా ఆడుకోలేకపోతున్నాను. పాఠాలు సరిగా చదవకపోవడం వలన టీచర్లు కూడా ఒక్కొక్క సారి కోప్పడేవారు. నాన్న వచ్చి టీచర్‌తో మాట్లాడిన తరువాత కోప్పడటం మానేసారు. మొన్న జ్వరం వచ్చిన దగ్గరి నుండి ఆకలి కూడా వేయడం లేదు.

ఇప్పుడు స్కూల్‌కి పండగ సెలవలు ఇచ్చి ఉంటారు. నేను దసరా సెలవల తరువాత స్కూల్‌కి వెళ్ళలేదు. ఎన్ని పాఠాలు చెప్పి ఉంటారో. లెక్కల టీచర్ బాగా చెప్తారు. నాకు లెక్కలంటే చాలా ఇష్టం. నేను లెక్కలు బాగా చేస్తాను. అందుకే టీచర్ నాకు కొత్త కొత్త లెక్కలు ఇస్తారు. ఏ లెక్కయినా నేను ఇట్టే చేయగలను. నాన్నతో ఒకసారి టీచర్ నన్ను ఇంజనీర్‌ని చేయమని చెప్పారు. ఇంగ్లీషు, తెలుగు రేణు ఆంటీని చెప్పమని అడగాలి. సైన్స్, సోషల్ ఎవరిని అడగాలి!! రవి నోట్స్ చదివి నాన్నే చెప్తాడేమో! తొందరగా జ్వరం తగ్గితే మళ్ళీ నేను రవి, కమల్, వినీతతో ఆడుకోవచ్చు. రోజు నాకు పండ్లు ఇచ్చే మస్తాన్ అన్న హాస్పిటల్‌కి వచ్చి పండ్లు ఇచ్చి వెళ్ళాడు. నేను హాస్పిటల్‌లో ఉన్న దగ్గరి నుంచి అన్నను చూడనే లేదు. ఇంటి దగ్గరయితే రోజు అన్న పండ్లు ఇస్తే నాన్న అన్నకు డబ్బులు ఇచ్చేవాడు. అన్నకు నేనంటే ఇష్టమే. వీధిలోకి పండ్ల బండితో మస్తాన్ అన్న వస్తే మాత్రం తప్పని సరిగా నాకు పండ్లు ఇవ్వాల్సిందే. రవి గాడికి నేనే అందులో వాటా పెట్టే వాడిని. అన్నకి పండ్ల లెక్కలు కూడా నేనే చెప్పేవాడిని. మరిప్పుడు ఎవరు చెప్తున్నారో. 'నువ్వు త్వరగా హాస్పిటల్ నుండి రా. నా లెక్కలు చాలా మిగిలాయి' అన్నాడు. ఈ రోజు టీచర్స్ ప్రిన్సిపాల్ కూడా హాస్పిటల్‌కి వచ్చారు. వాళ్ళందరిని చూడగానే నాకు స్కూల్‌కి వెళ్ళాలనిపించింది. కానీ చాలా రోజుల తరువాత నాకో రోజు బాగా నిద్ర వస్తున్నట్టు అనిపిస్తున్నది. మరీ సాయంత్రం నుంచి నిద్ర ముంచుకుని వస్తున్నట్టు ఉంది. నాకు ఇంక జ్వరం తగ్గి పోతుందని అనుకుంటున్నాను. నాన్న మాత్రం ఎందుకో దిగులుగానే ఉన్నాడు. నేను కళ్ళు మూసుకునే ఉన్నాను. గదిలో ఏ శబ్దం లేదు. అదిగో ఆ టప్ టప్ శబ్దం తప్ప. అది గోడ గడియారం చేస్తున్న నాకిష్టం లేని శబ్దం. నా కళ్ళు నెమ్మదిగా మూతలు పడుతున్నాయి. నాకు బాగా నిద్ర వస్తున్నది. ఇంత బాగా నిద్ర వచ్చి చాలా రోజులయింది. నెమ్మదిగా టిక్ టిక్ శబ్దం వినిపించడం కూడా తగ్గింది.

✦

అందమైన వధువు

చైనాలో ఓ నర్సు పేరు ఇప్పుడు వార్తల్లో నిలిచింది. హృదయమున్న ఆ యువతిని చైనాలోనే అత్యంత అందమైన వధువుగా ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఇదేదో అక్కడ జరిగిన పోటీల్లో గెలుపొందినందుకు కాదు. ఓ వ్యక్తి ప్రాణం కాపాడేందుకు దేన్నీ లెక్క చేయనందుకు.

పెళ్లికూతురి దుస్తులకున్నంత ప్రాధాన్యం జీవితంలో మరో సందర్భంలో వస్త్రాలకు ఉండదేమో. వాటిని ఎంతో జాగ్రత్తగా జీవితాంతం దాచుకుంటారు దేశవిదేశాల్లో వధువులు. ఇలాంటి అతి ముఖ్యమైన రోజే గువో యువాన్యువాన్‌కూ వచ్చింది. తూర్పు చైనాలో లియాంగ్ ప్రావిన్స్‌లోని డేలియాకు చెందిన పాతికేళ్ల ఈ అందాలరాశి నర్సుగా పనిచేస్తోంది. ఉద్యోగంలా కాక దాన్నో బాధ్యతగా విధులు నిర్వహిస్తూ తాను పనిచేసే ఆస్పత్రిలో మంచిపేరు కూడా పొందింది. ఇదే చూసి ప్రేమించాడు జియావో లియు. రోగుల్ని చాలా శ్రద్ధగా చూసుకుంటూ తన ప్రేమపూర్వక సేవతో అభిమానాన్ని చూరగొన్న లియుకు తన మనసులో మాట చెప్పి పెళ్లికి ఒప్పించాడు. అలా ఈ జంట గత నెలలోనే పెళ్లికి సిద్ధమైంది. వివాహ సందర్భంగా ఫొటోషూట్‌కు స్థానిక డేలియా పబ్లిక్ బీచ్‌ను ఎంచుకుంది. కొన్ని స్నాప్‌లు దిగాక బీచ్‌లో గందరగోళం మొదలైంది. వారికి ఓ వంద మీటర్ల దూరంలో జనం గుమికూడి కనిపించడంతో ఏం జరిగిందని ఆరా తీసింది గువో. ఎవరో సముద్రంలో మునిగిపోతే ఒడ్డుకు లాక్కొచ్చారని చెప్పారు. ఆ మాట చెవిన పడగానే క్షణం ఆలస్యం చేయకుండా ఎత్తైన ర్యాంపు నుంచి ఒక్క ఉదుటున దూకి గుంపు దగ్గరకు పరుగుతీసింది ఆ జంట. భర్త కన్నా వేగంగా కదిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని ఒడిలోకి తీసుకుంది గువో. కొన్ని క్షణాల పాటు పరిశీలించాక అతడి గుండె కొట్టుకోవడం ఆగిపోయిందని తెలుసుకున్న గువో వెంటనే సీపీఆర్ మొదలెట్టింది. చేతులతో రొమ్మును అదుముతూ, నోటి ద్వారా శ్వాస అందిస్తూ ఆ వ్యక్తిని కాపాడే ప్రయత్నం చేసింది. అంబులెన్స్ అక్కడకు చేరుకునేంత వరకు ఇలా 20 నిమిషాల పాటు వెరవని ప్రయత్నం చేసింది. పారామెడిక్స్ వచ్చి అంబులెన్స్‌లోని పరికరాలతో పరీక్ష చేసి ఆ వ్యక్తి చనిపోయాడని చెప్పారు. గువో తీవ్ర నిరాశ చెందింది. సముద్రంలో ఈదుతున్న సమయంలో ఆ గుర్తుతెలియని వ్యక్తికి గుండెపోటు వచ్చి ఉంటుందని, ఒడ్డుకు చేర్చే సరికే పెదాలు నీలి రంగులోకి మారిపోయాయని ఈతగాళ్లు చెప్పారు. తన పెళ్లి తంతు గురించి పట్టించుకోకుండా ఆ వ్యక్తిని కాపాడే విషయంలో పూర్తిగా మునిగిపోయిన గువో తాపత్రయాన్ని కొంతమంది ఫొటోలు తీశారు. వాటిని వెంటనే సామాజిక వెబ్‌సైట్లలో పోస్ట్ చేశారు. ఈ సందర్భంలో గువో పెళ్లి డ్రస్సు పూర్తిగా పాడైంది, ఆమె ఎత్తు నుంచి దూకడం వల్ల స్వల్ప గాయాలయ్యాయి. ఇవన్నీ లెక్కలోకి రాకున్నా ఆమె మాత్రం ఎంతో సంతోషంగా జరుపుకోవాల్సిన పెళ్లి రోజున తన చేతుల్లో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం తట్టుకోలేకపోయింది. గువోను అర్థం చేసుకున్న భర్త కొన్ని రోజులు వివాహ కార్యక్రమాలకు బ్రేక్ వేశాడు. విషయమంతా సామాజిక సైట్ల ద్వారా చైనా అంతటా వేగంగా వ్యాపించింది. స్థానిక సాంఘిక, సంక్షేమ, ఆరోగ్య శాఖ అధికారులూ గువో ప్రయత్నాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రకటించారు. చైనాలోనే గొప్ప అందమైన మనసున్న పెళ్లికూతురిలా అభివర్ణిస్తూ వార్తలు వ్యాపించాయి. ఈ ప్రశంసల్ని, పేర్లను పట్టించుకోకుండా గువో మళ్లీ ఆస్పత్రిలో తన సేవల్ని నిరాడంబరంగా మొదలుపెట్టింది. సాటి వ్యక్తిని కాపాడటం కన్నా మించిన విషయం తనకు లేదని ఇంటర్వ్యూల్లో చెప్పింది. తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తించడటం తప్ప కొత్తగా తాను చేసింది ఏమి లేదని అంటోంది. ఏదైనా జీవితంలో చాలా ముఖ్యమైన రోజనే కాక చాలామందిలా మనకెందుకులే అని వదిలేయక ఓ వ్యక్తిని కాపాడేందుకు గువో పడిన తాపత్రయం ప్రత్యక్షంగా చూసినవారిని కదిలించింది. నెట్లో ఎంతోమందికి ప్రేరణగా నిలిచింది.

✦

కవిత్వం

కూతవేటు దూరంలో జీవితం

ఆత్మహత్య చేసుకోపోగా
చావు తప్పి
జీవితంలోకి తిరిగి
ఉమ్మి వేయబడ్డ మూర్ఖుడా

చెప్పు!
దెయ్యాలకి భోజనాలగదిగా
ఎలా మారింది నీ మనసు?

ముళ్ళు
మెదడులో
ఎప్పుడు మొలిచాయి నీకు?

మృత్యువు గర్భసంచిలో
విచ్ఛిన్నమైన మూర్ఖుడా
నువ్వు మరణించి ఉంటే
ఊరు ఏడ్చి ఉండేది

చావలేదు
ఏడుస్తున్నావు నువ్వే!

ఇదిగో రుమాలు
తుడుచుకో కళ్ళు

ప్రాణం గొప్పదనం
తెలుసా నీకు?

మానవజాతి
మహత్తు తెలుసా నీకు?

ప్రాణం అనేది
కొద్ది దూరం
ప్రయాణం కాదు

అది
ప్రపంచ సారం

నిన్ను నువ్వు నాశనం చేసుకుంటే
ప్రపంచపు అస్తిత్వాన్ని
నాశనం చేసినట్టే

ప్రపంచాన్ని నాశనం చేసే
హక్కు నీకెక్కడిది?

జీవితం నిన్ను
భూమ్మీదికి పంపినప్పుడు
నీ చేతి నిండా పువ్వులు

ఇప్పుడేమిటి...
నీ చేతి సంచీ నిండా
శవపేటిక మేకులు?

ఆహా(
మరణంతో స్నేహమూ
మనిషితో విరోధమూనా?

మనుషులు లేకపోయినా
భూమి మిగిలే ఉంటుందిరా
మూర్ఖుడా!

భూమిని
వదిలి వెళ్ళాలని చూస్తున్న
పిచ్చివాడా
భూమి
నిన్ను వదిలెయ్యలేదురా!

గాలి నీ మీదే
ఉండుండి వీచిందా?

కిరణాలని
చందమామ
నీ మీదే నిలిపి ఉంచాడా?

పూలు నిన్ను చూసి
ఆకుల మాటున
దాక్కున్నాయా?

శిఖరాల మీద నివసించమని
జీవితం నిన్ను
ఆహ్వానిస్తూంటే

నువ్వెందుకు
చావు పల్లాలని
గోళ్ళతో తవ్వుతున్నావు?

ప్రాణం ఖరీదు
నీకు తెలియజేయాలి
లే
నా వెనకే రా
అదిగో చూడు

సగం జీవితకాలం
చేజారిపోయినప్పటికీ
శేష జీవితాన్ని
సంచీలో మూట కట్టుకుని
కూలీనాలీ చేస్తున్నాడే ఆ ముసలాడు
- ఎందుకని?

అపాయం తోచినప్పుడు
అంగుళం పొడుగున్న పురుగు
మిల్లీమీటర్ పొడవుకి
చుట్టుకుపోతుందే
- ఎందుకని?

పక్షి అయినప్పటికీ
ఎగరలేని కోడి
గద్దని చూడగానే
పరుగు లంకించుకుంటుందే
- ఎందుకని?

మరణం అనే వాస్తవానికి ఎదురొడ్డి
ఆస్పత్రులన్నీ
అబద్ధపు పోరాటాలు
సల్పుతున్నాయే
- ఎందుకని?

తొడిమె తెగి, నేలమీదికి వేలాడే
ఆ
ఒంటరి ఆకు
ఇంకా ఊగిసలాడుతోందే
- ఎందుకని?

జీవితాన్ని
ఒక్క నిమిషమైనా
పొడిగించుకోటానికే!

చూడు బాబూ
చావే
చావుని నిర్ధారిస్తుంది
జీవితాన్ని
నువ్వు నిర్ధారణ చెయ్యి

అర్థం చేసుకో
కాల్చేవరకే
నిప్పు

తిరిగేవరకే
భూమి

పోరాడే వరకే
మనిషి-
నువ్వు మనిషివి.

మూలం: తమిళ కవి వైరముత్తు
అనువాదం: ఆర్. శాంత సుందరి

వంకాయతో వెరైటీగా...

కుర్మా

కావాల్సిన పదార్థాలు

చిన్నని, గుండ్రని వంకాయలు- పావు కిలో, ఉల్లిపాయలు-2, అల్లం, వెల్లుల్లి- టీ స్పూను, పెరుగు- అర కప్పు, కొబ్బరి పొడి-రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర పొడి- అర టీ స్పూను, మెంతి పొడి-పావు టీ స్పూను, ధనియాల పొడి-టేబుల్ స్పూను, వేరుశెనగపప్పు - మూడు టేబుల్ స్పూన్లు, నువ్వులు- టేబుల్ స్పూను, కారం- టేబుల్ స్పూను, జీలకర్ర-పావు టీ స్పూను, మెంతులు- చిటికెడు, కొత్తిమీర- కొద్దిగా, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ

వంకాయను విడిపోకుండా నాలుగు ముక్కలుగా గుత్తి వంకాయ మాదిరిగానే చీల్చి ఉప్పు నీళ్లలో వేసి ఉంచాలి. బాణలిలో ఓ స్పూను నూనె వేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు మెత్తబడే వరకూ వేయించి తీసి పక్కన పెట్టాలి. వేరుశెనగ పప్పు, నువ్వులు, కొద్దిగా వేయించి పొడి చేయాలి. కొబ్బరి పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, మెంతి పొడి, వేరుశెనగ పొడి...కలపాలి. పసుపు, కారం, అల్లం వెల్లుల్లి ముద్ద, పెరుగు, కొత్తిమీర కలిపి మెత్తగా రుబ్బాలి. నీళ్లలో వేసిన వంకాయలను తీసి నూరిన ముద్దను కొంచెం కొంచెంగా కూరి మిగిలినది పక్కన ఉంచాలి. ఇప్పుడు ఉల్లిపాయలు వేయించిన బాణలిలోనే మిగిలిన నూనె వేసి కాగాక జీలకర్ర, మెంతులు వేసి వేయించాలి. తరువాత కూరిన వంకాయలు వేసి వెంటనే మూత పెట్టాలి. తక్కువ మంట మీద ఉడికించాలి. వంకాయలు మెత్తబడ్డ తరువాత మిగిలిన ముద్దలో కాసిని నీళ్ళు కలిపి పలుచగా చేసి కూరలో పోసి నూనె తేలే వరకు ఉడికించాలి.

బజ్జి

కావాల్సిన పదార్థాలు

వంకాయలు: పావుకిలో
సెనగపిండి: పెద్ద కప్పు, ఉప్పు: అర టీస్పూను, కారం: టీ స్పూను, ధనియాల పొడి: రెండు టీ స్పూన్లు, గరం మసాలా: టీస్పూను, సోడా: చిటికెడు, నూనె: వేయించడానికి సరిపడా

తయారీ

పొడవాటి వంకాయలను నిలువు ముక్కలుగా కోయాలి. పొట్టి వంకాయలైతే గుండ్రని సైజుల్లో కోసి ఉప్పు నీళ్లలో వేయాలి. ఓ గిన్నెలో సెనగపిండి, ఉప్పు, కారం, ధనియాల పొడి, గరం మసాలా పొడి, వంట సోడా వేసి గరిటె జారుగా కలిపి పదినిమిషాలు ఉంచాలి. ఇప్పుడు వంకాయ ముక్కలు నీళ్లలో నుంచి తీసి కాస్త ఆరనిచ్చి రెండు వైపులా ఉప్పు కారం చల్లి ఇలా చేయడం వల్ల బజ్జీలు చప్పగా ఉండకుండా ఉంటాయి. బాణలిలో నూనె వేసి కాగాక వంకాయ ముక్కలను ఒక్కొక్కటిగా సెనగపిండిలో ముంచి వేయాలి. కరకరలాడే వరకూ ఎర్రగా వేయించి తీసి టిష్యూ పేపర్ మీద వేస్తే ఎక్కువగా ఉన్న నూనెను పీల్చేసుకుంటాయి. వీటిని టొమాటో సాస్‌తో వడ్డిస్తే భలే రుచిగా ఉంటాయి. వంకాయ ముక్కలను ముందుగానే కరకరలాడేలా వేయించి తీసి అప్పుడు పిండిలో ముంచి కూడా బజ్జీలు వేసుకోవచ్చు.

సెనగపప్పు కూర

కావాల్సిన పదార్థాలు

వంకాయలు: పావు కిలో, సెనగపప్పు: అర కప్పు, ఉల్లిపాయ: ఒకటి, కరివేపాకు: 2 రెమ్మలు, అల్లం వెల్లుల్లి: టీ స్పూను, ఉప్పు: టీ స్పూను, గరం మసాలా: పావు టీ స్పూను, నూనె: 3 టేబుల్ స్పూన్లు

తయారీ

సెనగపప్పును కడిగి నానబెట్టాలి. వంకాయలను ముక్కలుగా కోసి ఉప్పు నీళ్లలో వేసి ఉంచాలి. ఉల్లిపాయలను సెనగపప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. కరివేపాకు,పసుపు, అల్లం వెల్లుల్లి ముద్ద, కారం సెనగపప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. తరువాత వంకాయ ముక్కలు ఉప్పు వేసి కలిపి మూత పెట్టి సన్నని మంట మీద ఉడికించాలి. ముక్క మెత్తబడిన తరువాత కప్పు నీళ్లు పోసి మూతపెట్టి ఉడికించాలి. వంకాయలు పప్పు బాగా ఉడికిన తరువాత గరం మసాల చల్లి దించితే కూర రెడీ.

గుత్తి వంకాయ వేపుడు

కావాల్సిన పదార్థాలు

గుండ్రని వంకాయలు: పావు కిలో, సెనగపిండి: అరకప్పు, పసుపు: చిటికెడు, కారం: టీ స్పూను, ధనియాల పొడి: టేబుల్ స్పూను, ఉప్పు: అర టీ స్పూను, కొత్తిమీర తురుము: టేబుల్ స్పూను, నూనె: టేబుల్ స్పూన్లు

తయారీ

గుత్తి వంకాయను కోసినట్లే ముక్కలుగా విడిపోకుండా వంకాయలు కోసుకుని ఉప్పు నీళ్లలో వేయాలి. విడిగా ఓ గిన్నెలో సెనగపిండి ఉప్పు, కారం, కొత్తిమీర, ధనియాల పొడి, పసుపు, 2 టీ స్పూన్ల నూనె వేసి బాగా కలపాలి. ఈ ముద్దను వంకాయల్లో కూరాలి. వెడల్పాటి పాన్ తీసుకుని నూనె వేసి కాగాక మసాలా కూరిన వంకాయలను వేసి విడిపోకుండా సిమ్‌లోనే వేయించి దించాలి.

కత్తిరించండి అతికించండి

ఇక్కడ కొన్ని కీటకాలున్నాయి. కాకపోతే వాటిలో కొంత భాగం మిస్సయిపోయింది. అలా కనిపించకుండాపోయిన భాగాలు కింద వున్నాయి. ఇంతకీ ఏ కీటకానికి ఏది సరిపోతుందో చూసి అతికించేయండి.



రంగులు వేయండి

పిల్లలూ! మీకు రంగులు వేయడం చాలా ఇష్టం కదూ. అప్పుడే రంగులద్దడం మొదలెట్టేశారా! ఒక్క నిమిషం! మేం చెప్పిన రంగులు మాత్రమే వేయండి.



భిన్నమైనది ఏది ?

ఈ చిత్రంలోని మూడు బొమ్మలు ఒకేలా ఉన్నాయి. అయితే ఇందులో ఒకటి తేడాగా ఉంది. దానిని గుర్తించండి.



బొమ్మ వేద్దామా

ఆర్టిస్టు అంకుల్ ఈ వారం చేప బొమ్మను వేయడం నేర్పిస్తాడు. అల్లరి చేయకుండా నేర్చుకోండే.



కనిపించని అక్షరాలు ఏవి?

ఇక్కడ ఆంగ్ల అక్షర మాల వరుస క్రమంలో వుంది. అయితే అక్కడక్కడ కొన్ని అక్షరాలు కనబడటం లేదు. మీరు రాసేస్తారా!

A	B		D		F
R	S	T		V	W
F		H		J	K
J	K		M	N	
L	M		O	P	Q

జవాబులు



గుర్తించండి

మీకు పండ్లు అంటే చాలా ఇష్టం కదూ. ఈ అక్షర సమూహంలో 13 పండ్లు దాక్కున్నాయి. అడ్డంగా, నిలువుగా, వంకరగా ఎలాగైనా ఉండొచ్చు. వాటిని గుర్తించి సున్నా చుట్టండి

A	K	O	L	I	M	E	C
B	I	R	E	G	E	P	A
F	W	A	M	R	L	E	P
R	I	N	P	A	O	A	R
U	F	G	L	P	N	R	I
I	N	E	U	E	L	G	C
T	L	E	M	O	N	E	O
S	C	H	E	R	R	Y	T

FRUITS APPLE ORANGE MANGO
APRICOT PEAR MELON CHERRY
KIWI LIME PLUM LEMON FIG

ఎక్కడ దాక్కున్నాయో

ఈ బొమ్మలో 22 వస్తువులు దాగి ఉన్నాయి. ఏవంటే... అదిగో కింద ఇచ్చాం కదా. వాటిని గుర్తించి సున్నా చుట్టండి.



శునక శకటం

రైలు ప్రయాణం చాలా బావుంటుంది కదా. అయితే మన వెంట పెంపుడు జంతువులను తీసుకెళ్లడానికి వుండదు. అందుకేనేమో! యూగిని బోస్టిక్ అనే అమెరికా తాత ఓ ఆలోచన చేశాడు. ఇంట్లోనే రైలు తయారు చేశాడు. ఎలా అనుకుంటారేమో! ఇదిగో అచ్చంగా బొమ్మలో మాదిరిగా. బోస్టిక్ తాత వెల్డింగ్ పనులు చాలా బాగా చేస్తాడు. తన దగ్గర వున్న ట్రాక్టర్‌కు నీళ్ల పీపాలను తగిలించేశాడు. వాటికి చక్రాలు కూడా పెట్టాడనుకోండి. ప్రియాతిప్రియమైన శునకాలు కూర్చోవడానికి వీలుగా పీపాలకు రంధ్రాలు కూడా చేశాడు. ఇంతకీ ఆయన దగ్గర ఇన్ని కుక్కలు ఎందుకున్నాయి అంటే... అదో బుల్లి కథ. టెక్సాస్‌లో బోస్టిక్ తాత ఇల్లు వీధి చివర్న పెడగా వుంటుంది. అక్కడ ఎవరికైనా సరే తమ పెంపుడు శునకాలను వదిలించుకోవాలనిపిస్తే.... తీసుకొచ్చి వీళ్ల ఇంటి దగ్గరలో విడిచిపెట్టేస్తుంటారట. వాటినలా రోడ్డు మీద చూడలేక ... ఇంటికి తెచ్చేస్తుంటాడు తాత. ఇక వాటి మంచీ చెడూ అన్నీ తనే. వాటిని ఎంచక్కా ఈ ట్రాక్టర్ రైల్లో కూర్చోబెట్టి షికారుకు కూడా తీసుకెళ్తాడు. అవి కూడా కదలకుండా ఎంత బుద్ధిగా కూర్చున్నాయో చూడండి.

◆ కొత్త పుస్తకాలు

అభ్యుదయ కవికి "ఆత్మీయం" అభినందన

సాహితీ విశ్లేషకుడిగా ఆధునిక సాహిత్యంలో తనదైన విశిష్టత సంతరించుకున్న ఉద్యమాల గొంతు ఎస్వీ సత్యనారాయణది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుండి అబ్బూరి రామకృష్ణారావు కవిత్వంపై ఎం.ఫిల్, "తెలుగు ఉద్యమ గేయాలపై" పరిశోధనకు పి.హెచ్.డి డిగ్రీలు అందుకొని ఉస్మానియా తెలుగు శాఖాధిపతిగా పనిచేసిన వారు ఎస్వీ. అలాగే కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులుగా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ పుస్తకంలో ఎస్వీ గురించి శ్రీపవి డా॥ టి.వి. నారాయణ డా॥ జి. పరిమళా సోమేశ్వర్, డా॥ఎన్.గోపి, విజయభాస్కర్, నవీన్ చింతపట్ల సుదర్శన్, రామారావు, జీడిగుంట వెంకట్రావ్ ఎండ్లూరి సుధాకర్, జె.చెన్నయ్య, పులి సాంబశివరావు, రాపోలు సుదర్శన్, వేల్పుల నారాయణ, చందు సుబ్బారావు, నూక తోట రవి కుమార్, రాచపాళెం చంద్రశేఖర్ రావు, సాశి కమలాకర శర్మ, మోతుకూరి నరహరి, రెంటాల వెంకటేశ్వర రావు, రావికంటి వాసునందన్, తెలకపల్లి రవి, డా॥బి.వి విజయలక్ష్మి, జ్యోత్స్న ప్రభ లాంటి సాహితీవేత్తలు తమ తమ ఆత్మీయతాభినందనలు.. ఎస్వీతో తమ స్నేహ సాహితీ సంబంధాలు అక్షర బద్ధం చేసారు. 60 సంవత్సరాలు షష్ఠిపూర్తి మహోత్సవాన్ని 63 మంది మేధావుల అభిప్రాయాలు 'ఉద్యోగ ఉద్యమ' జీవిత సాఫల్య దశగా అభ్యుదయ మార్గంలో ప్రయాణించే ఎస్వీ కృషి నేటి సాహితీ కవులకు రచయితలకు స్ఫూర్తినిస్తాయి. "అరసం" తో పెనవేసుకున్న ఎస్వీ జీవన గమనంపై ఇది కేవలం 10 శాతం మాత్రమే ఇంకా చాలా కృషి నమోదు చేయాలి. డా॥ భారతి కృషి అభినందనీయం–ఆత్మీయం.



ఆత్మీయం
సంపాదకులు: డా॥ కందిమళ్ళ భారతి
పేజీలు: 196/-, వెల: 150/-
ప్రతులకు: కన్నా–బన్ను ప్రచురణలు రాంనగర్–హైదరాబాద్.
నవచేతన బుక్ హౌస్, విశాలాంధ్ర, ప్రజాశక్తి, ప్రముఖ పుస్తక కేంద్రాలు.

ఈ గ్రంథాన్ని డాక్టర్ గారు తన తల్లిదండ్రులైన రామసుబ్బారెడ్డి, కృష్ణవేణమ్మ గార్లకు అంకితం చేశారు. నిమ్స్ మాజీ డైరక్టర్ పద్మశ్రీ డా॥ కాకర్ల సుబ్బారావు ముందు మాట రాసారు. ఇంకా డి.యల్. రవీంద్రరెడ్డి, వీర రాఘవరెడ్డి అభిప్రాయాలున్నాయి. ఈ పుస్తకం రోగులకే గాక సామాన్యులు కూడా తెలుసుకోవాల్సిన ఆరోగ్య రహస్యాలు, వ్యాధుల్ని గుర్తించి తక్షణ వైద్యం చేయించుకోవాల్సిన లక్షణాలను చక్కగా రాశారు. వైద్య సంబంధ అంశాలు అందరికీ అర్థమయ్యేలా రాయడం చాలా కష్టం. దాదాపు 13 అధ్యాయాలతో నాడీ సంబంధ



న్యూరో కేర్
డా॥ ముదిరెడ్డి చంద్రశేఖర్
పేజీలు: 128/-, వెల: 90/-
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్‌గిరి ప్రసాద్ భవన్, బండ్లగూడ, హైదరాబాద్

ఆరోగ్య సలహాదర్శిని

వ్యాధులు, నరాల ద్వారా సంక్రమించే జబ్బులు న్యూరోపతిగా తెలియజేయడం ప్రశంసనీయం. ఈ పుస్తకంలో ప్రధానంగా తల పోటు, మూర్ఛ వ్యాధి, మెడ నొప్పి, నడుము నొప్పి, వెర్టిగో నిద్ర లేమి, అతి నిద్ర, నరాల జబ్బులు, పక్షవాతం, మతిమరుపు, ఎండకాలంలో వచ్చే నరాల జబ్బులు, కోమా, వణుకు జబ్బులు, నాడీ వ్యవస్థకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలు ఆరోగ్య చిట్కాలు అందించారు. ఫాదర్ ఆఫ్ న్యూరాలజీ జాన్ హగ్ వింగ్ జాన్సన్ గురించి రాశారు.

తంగిరాల చక్రవర్తి

అంబేడ్కర్ పాటలు
రచన: నాగాబత్తుల గోపాలకృష్ణ
వెల: 20/-
పేజీలు: 71/-
ప్రతులకు: నాగాబత్తుల గోపాల కృష్ణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు. నందంపూడి, అంబాజీపేట, తూ॥గో॥జిల్లా.



కాలగమనంలో (కవితా సంపుటి)
రచయిత: దోసపాటి సత్యనారాణయ మూర్తి
వెల: 30/-, పేజీలు: 60/-
ప్రతులకు: శ్రీ దోసపాటి సత్యనారాయణ మూర్తి గాయత్రి నిలయం రాజ్మహేంద్రవరం రాజమండ్రి

సాధన సౌరభాలు
రచన: శ్రీమతి. టి. శాంతాభాస్కర్
వెల: 100/-,
పేజీలు: 72/-
ప్రతులకు: లోకేష్ ప్రచురణలు గిరింపేట, చిత్తూరు

రంగుల నత్తలు

రంగులతో స్కూబా డైవర్లను ప్రేమలో పడేస్తాయి సీ స్లగ్స్. పరిణామ క్రమంలో గుల్ల పెంకుల్ని పూర్తిగానో, దాదాపో విడిచిపెట్టిన ఇవి ఎక్కువ శాతం నత్తలకు చెందిన జాతులు. ఎంతో నాజూగ్గా, మెరిసే కాంతులతో చూపు తిప్పుకోనివ్వని వీటిని సముద్రపు సీతాకోక చిలుకలు అని పిలుస్తారు. మరీ ముద్దు చేసేవారు సీ ఏంజెల్స్ అని కూడా పిలుచుకుంటారు. కొన్ని మిల్లీ మీటర్ల నుంచి అర మీటరు వరకు ఉండే కొన్ని వేల రకాల సీ స్లగ్స్ ఉంటాయి. వీటిలో చాలా వాటిని ఇంకా గుర్తించాల్సి ఉంది. ఎన్నో అద్భుతాల్ని కడుపున దాచుకున్న సంద్రంలోని సీ స్లగ్స్ వింతల్ని చూడాల్సిందే. కాంతితో పాటు డీకంపోజైన సముద్ర మొక్కలు, చేపల ఇతర జీవుల కళేబరాల్ని భక్షిస్తూ శుభ్రం చేస్తాయివి. వీటికి శత్రువులూ ఎక్కువే. ఎండ్రకాయలు, చేపలకు ఇవి ఈజీ టార్గెట్లు. కొన్నింటికి మాత్రం టెంటకల్స్ ఉంటాయి. వాటి సాయంతో శత్రువుల దాడుల్ని తిప్పికొడతాయి. సీ కుకుంబర్లను మానవులు వైద్యంలో వాడతారు. ●



డొనాల్డ్ డక్
వయస్సు :81
(1931-...)



పోర్కీ పిగ్
వయస్సు :80
(1935-....)



డైసీ డక్
వయస్సు :75
(1940-...)



గూఫీ
వయస్సు :83
(1932-....)

కార్టూన్లకు వయసైతే...

గూఫీ కార్టూన్లను మీ చిన్ననాడు, మీ పెద్దలు వారి బాల్యంలో చూసే ఉంటారు. ఇవే కార్టూన్లను ఇప్పుడు మీ పిల్లలూ చూస్తున్నారు. వాటికి వయసు మళ్లదా అవి ముసలివి అవ్వవా అనుకున్నాడు రష్యాకు చెందిన ఆండ్రూ టారుసోవ్. అనుకున్నదే తడవుగా అవి ప్రచురణ అయిన రోజునే వాటి పుట్టిన రోజుగా భావించి వాటి వయసుకు తగ్గట్టుగా కార్టూన్లు వేశాడు. ఆయా కార్టూన్ పాత్రల తీరుకు తగ్గట్టుగా వాటి జీవితాల్లో ఎలాంటి మార్పులు వస్తాయో ఊహించి కార్టూన్లు వేయడంతో మంచి స్పందన వచ్చింది. మిక్కీ మౌస్ తనకున్న ఆదరణ పరంగా యానిమేషన్ టైకూన్ అయిపోయింది. గూఫీ ఇన్సూరెన్స్ చేసుకోని కారణంతో కట్టుబట్టలతో మిగిలింది. డొనాల్డ్ డక్‌కున్న గ్యాంబ్లింగ్ పిచ్చి కారణంగా డైసీ డక్ విడాకులిచ్చి ఒంటరిగా ఉంటోంది. టామ్ అండ్ జెర్రీ తెగ దెబ్బలాడుకోవడంతో శరీరమంతా ప్రాక్చర్లై కాళ్లీడ్చుకుంటూ తిరుగుతున్నాయి. దాదాపు అందరికీ 80 ఏళ్లు నిండిపోవడంతో వృద్ధాప్య ఛాయలు బాగా కొట్టొచ్చేలా కార్టూన్లు గీశాడు ఆండ్రూ. ●

ట్వీటీ, సిల్వస్టర్
వయస్సు : 73
(1942-...)

రోడ్ రన్నర్, కొయోట్
వయస్సు: 66 (1949..)





టామ్, జెర్రీ
వయస్సు:73
(1942....)